# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక




సంపుటి :12 సంచిక :302 మంగళవారం 30-6-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/

## ఫ్రాన్స్‌లో భానుడి భగభగ



- వెయ్యి మందికిపైగా బలి
- విలవిల్లాడుతున్న జనజీవనం
- వృద్ధులే లక్ష్యంగా వడగాల్పుల దాడి
- కిక్కిరిసిన ఆస్పత్రులు, శ్మశానవాటికలు:
- అత్యంత దారుణంగా సైప్రస్ పరిస్థితి

2

## అఫ్గానిస్థాన్‌పై పాక్ భీకర దాడి



- చిన్నారులు సహా 35 మంది మృతి
- సహాయక సిబ్బందిని లక్ష్యంగా చేసుకున్న పాక్ సైన్యం
- ప్రతీకార దాడులంటూ పాకిస్థాన్ వాదన
- పిరికిపంద చర్యగా అభివర్ణించిన జబిహుల్లా ముజాహిద్
- అంతర్జాతీయ శాంతిదూతగా నటిస్తూ పొరుగు దేశంపై దాడులు
- పాకిస్థాన్ ద్వంద్వ వైఖరిపై విమర్శలు

2



## దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతి

- హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం జరగాలి
- రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలి
- ప్రారంభానికి ప్రధాని మోడీకి ఆహ్వానం
- నిర్మాణ సంస్థలతో సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి,**

యావత్ దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతిని నిర్మిస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం జరగాలని అన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ నగర నిర్మాణంలో కాంట్రాక్టు సంస్థలు కూడా భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అమరావతిలో నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో కాంట్రాక్టు సంస్థలతో సీఎం సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత గడువు కంటే ముందే నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం రూ.50,999 కోట్ల విలువైన పనులు కాంట్రాక్టు సంస్థలకు అప్పగించామని అధికారులు వివరించారు. హౌసింగ్, ట్రంక్ ఇన్ ఫ్రా, ఎల్పీఎస్ ఇన్ ఫ్రా, సహా అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల లాంటి ఐకానిక్ భవనాల నిర్మాణ ప్రాజెక్టులు వేగంగా

-మిగతా 2 లో

## రైతు ఆశీర్వాద సభ
# వాయిదా

### వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నిర్ణయం

- వాయిదా పడినా ఆగని 'రైతు భరోసా'
- మంగళవారం నుంచి నిధుల విడుదల
- తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లు: రైతుల ఖాతాల్లోకి జమ
- జులై 6, 7 లేదా 8న ముగింపు వేడుకలు నిర్వహించేందుకు సన్నాహాలు
- సభా ప్రాంగణంలో బురద కారణంగా మార్పు
- రుణమాఫీ, రైతు భరోసాపై విపక్షాల అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టిన మంత్రి తుమ్మల

**ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి**

ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరణుడు కరుణించాడని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. వర్షాల నేపథ్యంలో సీఎం ఖమ్మం పర్యటన వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. రైతు భరోసా పంపిణీ అనంతరం రైతు ఆశీర్వాద సభ ఉంటుందన్నారు. చింతకాని మండలం జగన్నాథపురంలో రైతు ఆశీర్వాద సభా ప్రాంగణాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి డిప్యూటీ సీఎం సోమవారం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు

-మిగతా 2 లో





## పరస్పర దాడులు నిలిపివేత

- అంగీకారానికి వచ్చిన ఇరాన్, అమెరికా
- హోర్ముజ్‌పై నేడు దోహాలో సంప్రదింపులు

2



## జులై 4న ఖమేనీ అంత్యక్రియలు

- హాజరు కానున్న కేంద్రమంత్రి


2



2

## 2028 నుంచి పెట్రోల్ బైకుల రిజిస్ట్రేషన్ బంద్

- రూ.30 లక్షల లోపు ఈ-కార్లకు పన్ను రాయితీ
- విద్యుత్తు వాహనాల పాలసీకి ఢిల్లీ సర్కార్ ఆమోదం



## వాహనదారులకు ఊరట

- సాధారణ స్థితికి చేరిన ఇంధన సరఫరా:
- మళ్లీ అందుబాటులోకి పూర్తిస్థాయి ఇంధనం
- ఇరాన్-అమెరికా చర్చలతో మెరుగుపడిన పరిస్థితి
- ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌పై తొలగిన ఆంక్షలు:

2

**జూలై 1 ను పెట్రోల్, డీజిల్ ఆంక్షల ఎత్తివేత**

## హరీష్ రావుకు మెంటల్
# బ్యాలెన్స్ తప్పింది



### ప్రజలు ఐదేళ్లకు తీర్పునిచ్చారు... ఎందుకు అసెంబ్లీని రద్దు చేయాలి

- ప్రతి ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ప్రజలు శిక్ష వేస్తూనే ఉన్నారు
- బిజేపీది ఆశకాదు.. అత్యాశ
- రైతు భరోసా నిధులు వారంరోజుల్లో జమ చేస్తాం
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్**

బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్న తీరుచూస్తుంటే ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందనే అనుమానం కలుగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలన్న హరీష్ రావు

-మిగతా 2 లో



## ప్రపంచ దేశాలు అతలాకుతలం

- 17 ఏండ్లలో అత్యంత బలహీన నైరుతి ఆరంభమిదే
- సాధారణం కంటే 42% తక్కువగా జూన్ వర్షపాతం
- 166 ప్రధాన రిజర్వాయర్లలో 25 శాతమే నీటి నిల్వ!
- వేడెక్కుతున్న అట్లాంటిక్.. పసిఫిక్‌లో ఎల్‌నినో
- ఐరోపా, ఉత్తర అమెరికాలో అధిక ఉష్ణోగ్రతలు
- వర్షాభావంతో భారత ఉప ఖండంలో కరువు!

**న్యూఢిల్లీ,**

రెండు మహాసముద్రాలు పలు ప్రపంచ దేశాల్లో కోట్ల మందిని అతలాకుతలం చేస్తున్నాయి. ఒకటి అట్లాంటిక్ మహా సముద్రం కాగా, రెండోది పసిఫిక్ మహాసముద్రం. కొన్ని వేల కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రెండు మహాసముద్రాలు వాతావరణంలో మార్పులకు కారణమవుతున్నాయి. వేడెక్కుతున్న అట్లాంటిక్ మహాసముద్రం కారణంగా ఐరోపా, ఉత్తర అమెరికా ఖండాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతన్నాయి. మరోవైపు పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న ఎల్ నినో కారణంగా భారతదేశంలో

-మిగతా 2 లో



## ఉద్యోగులకు తీపికబురు

- మరో రూ.2 వేల కోట్ల బకాయిలు విడుదల
- ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో నిధులు విడుదల
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి చాటుకుంది. ఉద్యోగులకు తీపికబురు అందించింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చింది. బకాయిల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేసింది. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కల ఆదేశాల మేరకు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సోమవారం రూ.రెండు వేల కోట్ల నిధులను విడుదల చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు,

-మిగతా 2 లో

# ఫ్రాన్స్‌లో భానుడి భగభగ

- వెయ్యి మందికిపైగా బలి
-విలవిల్లాడుతున్న జనజీవనం
- వృద్ధులే లక్ష్యంగా వడగాల్పుల దాడి
- కిక్కిరిసిన ఆస్పత్రులు, శ్మశానవాటికలు:
- అత్యంత దారుణంగా సైప్రస్ పరిస్థితి


పారిస్



యూరోప్‌లో సమ్మర్ సెగ పుట్టిస్తోంది. వేడి తట్టుకోలేక.. జనం విలవిలలాడుతున్నారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల ఫ్రాన్స్‌లో మృతుల సంఖ్య భారీగా నమోదు అవుతోంది. సాధారణం కన్నా ఈసారి వెయ్యి మంది అధికంగా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు చెప్పారు. గడిచిన రెండు దశాబ్ధాలతో పోలిస్తే, ఈసారి ఎండ తీవ్రత మరీ ఎక్కువగా నమోదు అయినట్లు తెలుస్తోంది. ఫ్రాన్స్‌లోని అనేక ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా 40 డిగ్రీల కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. దీంతో మంగళవారం ఆ దేశంలో అత్యంత వేడి దినంగా నమోదు అయ్యింది. 2003 తర్వాత భారీ స్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతులు నమోదు అవుతున్నాయి.జూన్ 24వ తేదీ నుంచి అధికంగా సుమారు వెయ్యి మందికిపైగా వేడి వల్ల మృతిచెందినట్లు నేషనల్ పబ్లిక్ హెల్త్ ఏజెన్సీ పేర్కొన్నది. అయితే బాధితుల్లో 85 శాతం మంది 65 ఏళ్లు దాటినవారే ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. ఐలీ డీ ఫ్రాన్స్ ప్రాంతంలో మృతుల సంఖ్య 40 శాతం పెరిగినట్లు తెలిసింది. నార్మాండీ, బ్రిట్టనీ, సెంటర్ వాల్ డీ లోయిరి, పేస్ డీ లా లోయిరి, నోవెల్లి అక్వోయింటిని ప్రాంతాలు కూడా తీవ్ర హీట్‌వేవ్‌కు గురవుతున్నాయి. పారిస్‌లో అనేక ఈవెంట్లను రద్దు చేశారు. వార్షిక ప్రైడ్ మార్చ్ కూడా రద్దు అయ్యింది. ఆస్పత్రులు, శ్మశానవాటికలు కిక్కిరిసిపోతున్నట్లు అధికారులు చెప్పారు. పబ్లిక్ సేవలన్నీ అధిక భారంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. సమ్మర్ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఆదివారం జర్మనీలో 41.7 డిగ్రీలు, చెక్ రిపబ్లిక్‌లో 41.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. వేసవి కాలంలో ఈ సారి అనేక యురోప్ దేశాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉన్నట్లు యురోపియన్ యూనియన్ తెలిపింది. సైప్రస్‌లో అత్యధికంగా 92 శాతం నీటి కొరత ఉన్నట్లు పేర్కొన్నది. మాల్టాలో 66 శాతం, టర్కీ.. గ్రీస్, రొమేనియా, పోర్చుగల్ దేశాల్లో 30 శాతంపైనే నీటి సమస్య ఉన్నట్లు తెలుస్తోంది.

# పరస్పర దాడులు నిలిపివేత

అంగీకారానికి వచ్చిన ఇరాన్, అమెరికా
హోర్ముజ్‌పై నేడు దోహాలో సంప్రదింపులు



-- జనరల్ డెస్క్
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు సడలి సాధారణ పరిస్థితులు నెలకొనే అవకాశాలు కన్పిస్తున్నాయి. పరస్పర దాడులను నిలిపివేసేందుకు ఇరాన్, అమెరికా అంగీకరించాయి. హోర్ముజ్ జలసంధిపై ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించుకోవడానికి తిరిగి సంప్రదింపులు ప్రారంభించాలని నిర్ణయించాయి. దీంతో తాత్కాలిక శాంతి ఒడంబడిక సజీవంగానే ఉంటుందన్న ఆశాభావం వ ?యక్తమవుతోంది. 'ఎంఓయూలోని అన్ని అంశాల పైన సాంకేతిక చర్చలు కొనసాగుతాయి. ఇరు పక్షాలు దాడులకు స్వస్తి చెబుతాయి. హోర్ముజ్‌లో నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించవచ్చు' అని ఓ అమెరికా అధికారి తెలిపారు. ఈ నెల 17న 14 సూత్రాల అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై ఇరాన్, అమెరికా సంతకాలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందం ప్రకారమే హోర్ముజ్‌ను వాణిజ్య నౌకల రాకపోకలకు తెరిచారు. కాగా ఇరు పక్షాల మధ్య మంగళవారం ఖతార్‌లో చర్చలు ప్రారంభం అవుతాయని ఆక్సియాస్ వార్తా సంస్థ తెలియజేసింది. జలసంధిలో ప్రయాణిస్తున్న ఓ వాణిజ్య నౌకపై గురువారం ఇరాన్ దాడి జరిపిన నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో తిరిగి ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఎంఓయూ కింద కుదుర్చుకున్న కాల్పుల విరమణను ఇరు దేశాలు బేఖాతరు చేసి దాడులు, ప్రతిదాడులకు దిగాయి. ఆదివారం ఉదయం కువైట్, అమెరికా స్థావరాలపై ఇరాన్ సేనలు క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. యుద్ధాన్ని ముగించేందుకు కుదుర్చుకున్న ఒప్పందాన్ని గౌరవించని పక్షంలో ఇరాన్ అనేదే ఉండదని అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. ఇరు దేశాల మధ్య తాజాగా హింస చోటుచేసుకున్నప్పటికీ ఇరాన్, అమెరికా అధికారులు మాత్రం నేడు దోహాలో సమావేశమవుతారు. ఎంఓయూను సజీవంగా ఉంచేందుకు, మరో సైనిక చర్య జరగకుండా నివారించేందుకు ప్రయత్నిస్తారు.

# జులై 4న ఖమేనీ అంత్యక్రియలు

హాజరు కానున్న కేంద్రమంత్రి



న్యూఢిల్లీ,
ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు భారత్ తరపున విదేశాంగ శాఖ సహాయమంత్రి పబిత్ర మార్గరీటా హాజరుకానున్నట్టు సమాచారం. మంత్రి పబిత్రతో పాటు బిహార్ గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ కూడా వెళ్లనున్నట్టు తెలుస్తోంది. అయతొల్లా ఖమేనీ అంత్యక్రియలకు రావాలని ప్రధాని మోదీని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఇటీవల ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో భారత్ తరపున కేంద్ర మంత్రి, బిహార్ గవర్నర్ ఇరాన్‌కు వెళ్లనున్నట్టు తెలుస్తోంది. అయతొల్లా జన్మస్థలమైన మష్హాద్ నగరంలోనే జులై 4న ఆయన అంత్యక్రియలను నిర్వహించనున్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు ఫిబ్రవరి 28న దాడులు ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలి రోజు జరిగిన దాడిలోనే ఖమేనీ కన్నుమూశారు. దాదాపు 36 ఏళ్ల పాటు ఆయన ఇరాన్‌ను ముందుండి నడిపించారు. ఖమేనీ స్మృత్యర్థం కోమ్ నగరంలో కూడా ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఖమేనీ అంత్యక్రియలపై తొలి నుంచీ కొంత సందిగ్ధత నెలకొంది. జూన్‌లో అంత్యక్రియలు పూర్తవుతాయని మొదట్లో వార్తలు వెలువడ్డాయి. అయితే, జులైలో ఈ కార్యక్రమం జరుగుతుందని ప్రభుత్వ మీడియా ఇటీవల ధ్రువీకరించింది. అంత్యక్రియలకు దాదాపు 20 మిలియన్ల మంది హాజరుకానున్నట్టు ఇరాన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ కూడా ఇరాన్‌కు వెళ్లే అవకాశం ఉంది. ఇక అయతొల్లా ఖమేనీ అనంతరం ఆయన కుమారుడు మొజ్తాబా ఖమేనీ ప్రస్తుతం ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఉన్నారు. అయితే, ఆయన ఎక్కడున్నారనే దానిపై స్పష్టత లేదు. మొజ్తాబా ఆరోగ్యంపై కూడా పలు వార్తలు వెలువడ్డాయి. ఆయన కోమాలో ఉండే అవకాశం ఉందని సీనియర్ యూఎస్ అధికారులు పలుమార్లు తెలిపారు.

# ప్రపంచ దేశాలు అతలాకుతలం

మొదటి తరువాయి

నైరుతి రుతుపవనాలకు అవాంతరం ఏర్పడుతున్నది. దీంతో దేశంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనట్టి కరువు పరిస్థితులకు దారితీస్తున్నది. దీంతో న్యూఢిల్లీ నుంచి న్యూయార్క్ వరకు విస్తరించిన ఈ అసాధారణ వాతావరణ పరిస్థితులకు ఈ రెండు మహాసముద్రాలు కారణమవుతున్నాయి.

**ఉష్ణ గుమ్మటాలు బలపడే చాన్స్**

వేడెక్కుతున్న అట్లాంటిక్ మహాసముద్రం కారణంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఐరోపా ఖండంలో వడగాలులు వీయడమే కాకుండా స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ, ఫ్రాన్స్ దేశాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటుతున్నాయి. ఈ వాతావరణ ధోరణి పశ్చిమ దిశగా విస్తరిస్తున్నదని, దీంతో ఉష్ణ గుమ్మటాలు బలపడి అమెరికాలో సైతం రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నదని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిరంతరం అధిక వాతావరణ పీడనం ఉండే ప్రాంతంలో భూ ఉపరితలం దగ్గర వేడి గాలులను బంధించినప్పుడు ఉష్ణగుమ్మటం ఏర్పడుతుందని వారు వివరించారు. ఆ సమయంలో దిగువకు వీచే గాలి సంకోచించి వేడెక్కుతుందని, అదే సమయంలో ఆకాశం నిర్మలంగా మారడంతో సూర్యరశ్మి నేలను దహించి వేస్తుందని తెలిపారు.

# అఫ్గానిస్థాన్‌పై పాక్ భీకర దాడి

-చిన్నారులు సహా 35 మంది మృతి
-సహాయక సిబ్బందిని లక్ష్యంగా చేసుకున్న పాక్ సైన్యం
- ప్రతీకార దాడులంటూ పాకిస్థాన్ వాదన
- పిరికిపంద చర్యగా అభివర్ణించిన జబిహుల్లా ముజాహిద్
-అంతర్జాతీయ శాంతిదూతగా నటిస్తూ పొరుగు దేశంపై దాడులు
- పాకిస్థాన్ ద్వంద్వ వైఖరిపై విమర్శలు



న్యూఢిల్లీ,
అంతర్జాతీయ వేదికపై అమెరికా, ఇరాన్ దేశాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు మధ్యవర్తిత్వం వహిస్తూ ప్రశంసలు అందుకుంటున్న పాకిస్థాన్ తన సొంత సరిహద్దుల్లో మాత్రం అఫ్గానిస్థాన్ పై భీకర దాడులకు పాల్పడుతోంది. ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లో పాకిస్థాన్ సైన్యం తాజాగా జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 35 మంది మరణించారు. మృతులంతా ఉగ్రవాదులేనని పాకిస్థాన్ వాదిస్తుండగా.. అమాయక పౌరులు, చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని అఫ్గానిస్థాన్ ఆరోపిస్తున్నది. ఈ దాడుల్లో పాకిస్థాన్ సైన్యం అనుసరించిన వివాదాస్పద 'డబుల్ ట్యాప్ ' వ్యూహం తీవ్ర విమర్శలకు దారితీసింది. సైనిక పరిభాషలో 'డబుల్ ట్యాప్' అంటే ఒకే ప్రదేశంపై కొద్ది సమయం వ్యవధిలో రెండోసారి దాడి చేయడం. దీన్ని అత్యంత క్రూరమైన, అమానవీయమైన వ్యూహంగా పరిగణిస్తారు. ఎందుకంటే మొదటి దాడి తర్వాత సహాయక చర్యల కోసం వచ్చే సిబ్బంది, వైద్యులు, పౌరులను లక్ష్యంగా చేసుకుని రెండో దాడి జరుపుతారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి 12:30 గంటలకు పాకిస్థాన్ వైమానిక దళం ఫైటర్ జెట్‌లు అఫ్గానిస్థాన్‌లోని పక్తికా, పక్తియా, కునార్ జిల్లాల్లోని ఇళ్లు, మసీదులపై బాంబులు వేశాయి. సరిగ్గా 25 నిమిషాల తర్వాత అంటే 12:55 గంటలకు శిథిలాల కింద చిక్కుకున్న మహిళలు, పిల్లలను కాపాడేందుకు గ్రామస్థులు పరుగెత్తుకురాగా.. పాకిస్థాన్ సైన్యం రెండోసారి బాంబుల వర్షం కురిపించింది. ఈ రెండో దాడితో మృతులు, క్షతగాత్రుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. వందకుపైగా క్షతగాత్రులతో ఆస్పత్రులు నిండిపోయాయి. గతవారం కరాచీలో తమ సైనిక దళాలపై జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు పాకిస్థాన్ ప్రకటించింది. తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ నుంచి విడిపోయిన జమాత్-ఉల్-అహ్రార్ ఉగ్రవాదుల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిపామని, ఈ దాడుల్లో 29 మంది ఉగ్రవాదులు హతమయ్యారని పాకిస్థాన్ సమాచార శాఖ మంత్రి అత్తావుల్లా తారర్ తెలిపారు. అయితే పాకిస్థాన్ వాదనను ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపందల చర్య అని, పాకిస్థాన్ దురాక్రమణకు పాల్పడిందని తాలిబన్ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ మండిపడ్డారు. ఈ దాడుల్లో 35 మందికిపైగా అమాయక పౌరులు మరణించారని, వీరిలో 4 నుంచి 9 ఏళ్ల వయసున్న చిన్నారులు, వృద్ధులు ఉన్నారని ఆయన తెలిపారు. పాకిస్థాన్‌పై దాడి జరిగినప్పుడు ఆ ప్రాంతంలో ఎలాంటి ఉగ్రవాదులు లేరని, సహాయక చర్యల్లో పాల్గొంటున్న మాపైనే రెండోసారి బాంబు వేశారని అన్నారు. ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు పాకిస్థాన్ అబద్ధాలు చెబుతోంది" అని దాడిలో గాయపడిన ఒక స్థానికుడు ఆవేదన వ్యక్తంచేశాడు. కాగా అఫ్గానిస్థాన్‌లో 2021లో తాలిబన్‌లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాక్-అఫ్ఘాన్ సంబంధాలు ఉద్రిక్తంగానే ఉన్నాయని, సరిహద్దుల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం ఇస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తుండగా.. తమ భూభాగంలో ఉగ్రవాదులు ఎవరూ లేరని తాలిబన్‌లు స్పష్టం చేస్తున్నారు. గత 9 నెలల్లో పాకిస్థాన్ జరిపిన దాడుల్లో సుమారు 570 మంది అమాయక అఫ్గాన్ పౌరులు ప్రాణాలు కోల్పోయారని నివేదికలు చెబుతున్నాయి. ఒకవైపు అంతర్జాతీయ శాంతిదూతగా వ్యవహరిస్తూ మరోవైపు పొరుగు దేశంపై దాడులకు పాల్పడటం పాకిస్థాన్ ద్వంద్వ వైఖరిని స్పష్టంచేస్తోంది.

# రైతు ఆశీర్వాద సభ వాయిదా

మొదటి తరువాయి

చేసిన మీడియా సమావేశంలో మంత్రులు మాట్లాడారు. వాతావరణ పరిస్థితులు, వర్షాల కారణంగా ఈ నెల 30న ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్, జగన్నాథపురం గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యే రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సభా ప్రాంగణం పూర్తిగా బురదమయంగా మారిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో లక్షలాది మంది రైతుల సమక్షంలో సభ నిర్వహించడం సాధ్యం కాదన్నారు. రైతు భరోసా పంపిణీ పూర్తయిన అనంతరం మరింత వైభవంగా 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు వేడుక నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం జిల్లాలో జులై 3 లేదా 4వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మరో వారం రోజుల వాతావరణ పరిస్థితులను సమీక్షించి, అనుకూలిస్తే జులై 6 లేదా 7, 8వ తేదీల్లో సభ నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు కొనసాగిస్తున్నట్టు తెలిపారు.

వర్షం అడ్డపడినా భరోసా ఆగదు : మంత్రి తుమ్మల

రైతు ఆశీర్వాద సభకు వర్షం అడ్డుపడినా రైతు భరోసా నిధుల విడుదల మాత్రం యథావిధిగా కొనసాగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వానాకాలం సాగు దృష్ట్యా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతు భరోసా నిధుల విడుదలకు సీఎం సిద్ధంగా ఉన్నారని, మంగళవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకం నిధులను విడుదల చేస్తారని వెల్లడించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ అంశాలపై ప్రతిపక్ష నాయకులు అర్థంపర్థం లేని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదేండ్లలో రైతుబంధు కింద రూ. 72 వేల కోట్లు ఇవ్వగా, ప్రజా ప్రభుత్వం కేవలం రెండున్నరేండ్లలోనే రైతు భరోసా ద్వారా రూ. 36 వేల కోట్ల సాయం అందించిందని తెలిపారు. యూరియా యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందుతున్నాయన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ యాకూబ్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రీనివాసాచారి, పీఆర్‌ఎస్‌ఈ వెంకట్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి విజయ చందర్, డీఆర్డీవో శ్రీరామ్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 2028 నుంచి పెట్రోల్ బైకుల రిజిస్ట్రేషన్ బంద్


రూ.30 లక్షల లోపు ఈ-కార్లకు పన్ను రాయితీ
విద్యుత్తు వాహనాల పాలసీకి ఢిల్లీ సర్కార్ ఆమోదం



న్యూఢిల్లీ :
దేశ రాజధానిలో స్వచ్ఛ రవాణా విధానం వైపు మళ్లింపును వేగవంతం చేసేందుకు రేఖా గుప్తా ప్రభుత్వం విస్తృత ప్రోత్సాహకాల ప్యాకేజీ ప్రకటించింది. లెఫ్టినెంట్ గవర్నర్ సంధు దీన్ని ఆమోదిస్తే జూలై 1 నుంచి దీన్ని అమలు చేస్తామని ఢిల్లీ సీఎం రేఖా గుప్తా సోమవారం తెలిపారు. ఈ విధానం 2030 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని చెప్పారు. ఈ విధానంలో విద్యుత్తు కార్లకు పన్ను రాయితీ, కొనుగోలు ప్రోత్సాహకం ఇవ్వనున్నారు.విద్యుత్తు ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసేవారికి మొదటి మూడేండ్లు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు రాయితీగా ఇవ్వనున్నారు. విద్యుత్తు త్రిచక్ర వాహనాలు కొనేవారికి ఇదే విధంగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు ప్రోత్సాహకంగా ఇవ్వనున్నారు. 2027 జనవరి 1 నుంచి కేవలం విద్యుత్తు ఆటో రిక్షాలకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేస్తారు. కొత్త పెట్రోల్, సీఎన్‌జీ ఆధారిత ద్వి చక్ర వాహనాలకు 2028 ఏప్రిల్ 1 నుంచి రిజిస్ట్రేషన్లు చేయరు.

# వాహనదారులకు ఊరట

-జూలై 1 నుంచి పెట్రోల్, డీజిల్ ఆంక్షల ఎత్తివేత
- సాధారణ స్థితికి చేరిన ఇంధన సరఫరా:
-మళ్లీ అందుబాటులోకి పూర్తిస్థాయి ఇంధనం
-ఇరాన్-అమెరికా చర్చలతో మెరుగుపడిన పరిస్థితి
- ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌పై తొలగిన ఆంక్షలు:



న్యూఢిల్లీ :
వాహనదారులకు గుడ్‌న్యూస్. పెట్రోల్, డీజిల్ సరఫరాపై విధించిన ఆంక్షలను కేంద్రం ఎత్తేయనుంది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ సరఫరాపై ఆంక్షలను కొనసాగుతున్న జూలై 1వ తేదీ బుధవారం నుంచి ఎత్తివేస్తున్నట్టు వెల్లడించింది. దేశంలో పెట్రోలియం ఉత్పత్తులు సాధారణ స్థితికి చేరినందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్రం తెలిపింది.పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా పెట్రోలియం ఉత్పత్తుల కొరత ఏర్పడడంతో.. జూన్ 12వ తేదీన సరఫరాపై కేంద్రం ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఇరాన్, అమెరికా మధ్య శాంతి చర్చలు, ఒప్పందాలు కుదరడంతో పరిస్థితిలో మార్పు వచ్చింది. దాంతో, దేశంలో పెట్రోల్, డీజిల్ సరఫరా మునపటి స్థితికి చేరుకుంది. ఈ నేపథ్యంలోనే ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌పై విధించిన ఆంక్షలను జూలై 1 నుంచి కేంద్రం ఎత్తేయనుంది.

# దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతి

మొదటి తరువాయి

జరుగుతున్నాయని తెలిపారు. పనులు వేగంగా చేసేందుకు అవసరమైన మానవ వనరులు, యంత్రాలు ఇతర సామాగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5140కి పైగా భారీ యంత్రాలు నిర్మాణ పనుల్లో నిమగ్నమైనట్టు మంత్రి నారాయణ సీఎంకు వివరించారు. నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకమూ లేకుండా కొండవీటి వాగు, పాలవాగు ప్రవాహాలు సజావుగా సాగేందుకు వీలుగా వాటిని వెడల్పు చేస్తున్నామని మంత్రి తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం.. భవిష్యత్ నగరంగా నిర్మిస్తు?న్న అమరావతి నిర్మాణంలో పని చేశామన్న బ్రాండ్ ను కాంట్రాక్టర్లు సంపాదించేలా పనులు చేపట్టాలని సూచించారు. కొందరు వ్యక్తులు కావాలని లిటిగెంట్లుగా మారి రాజధాని పనుల్ని అడ్డుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని.. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లాలని సీఎం స్పష్టం చేశారు. కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల నివాసాలు, రహదారులు, మౌలిక సదుపాయాలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల నిర్మాణాలపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ పుణ్య క్షేత్రాలు, నదుల నుంచి పవిత్రమైన మట్టి, నీళ్లు తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని పునీతం చేశామని.. గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని ఆపేశారని సీఎం అన్నారు. గడచిన రెండేళ్లుగా అమరావతి నిర్మాణాన్ని మళ్లీ గాడిలో పెట్టామన్నారు. అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా నిర్మాణం చేస్తున్న అమరావతిలో భాగస్వాములం అయ్యామన్న ఆలోచనతో కాంట్రాక్టు సంస్థలు పనిచేయాలని సీఎం సూచించారు. పనులు పూర్తి అయ్యాక రాజధాని నిర్మాణాల ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిస్తామని సీఎం తెలిపారు. నిర్మాణ పనుల వేగంతో పాటు నాణ్యత పై కూడా ఎక్కడా రాజీ లేకుండా చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ భవనాలు ఐకానిక్ నిర్మాణాలుగా ఉండాలని పేర్కొన్నారు. అమరావతికి పేరు తెచ్చేలా ఈ భవనాలను నిర్మించాలన్నారు. రాజధాని నిర్మాణంలో చిన్న ఇబ్బందులు కూడా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి నిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తానని సీఎం స్పష్టం చేశారు. ఎల్ అండ్ టీ, షాపూర్ జీ పల్లోంజి, మెగా ఇంజినీరింగ్, ఎన్సీసీ, బీఎస్ఆర్, కేఎంవీ సహా వేర్వేరు కాంట్రాక్టు సంస్థలు చేపట్టిన పనులకు సంబంధించిన అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా సంస్థల ప్రతినిధులకు సీఎం దిశా నిర్దేశం చేశారు.

## హరీష్ రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది

మొదటి తరువాయి

వ్యాఖ్యలపై పై విధంగా స్పందించారు. తెలంగాణ ప్రజానీకం మాకు ఐదేళ్లకు అధికారమిచ్చారు. రెండున్నరేళ్లకే ఎందుకు అసెంబ్లీని రద్దు చేస్తాం. ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. గడచిన రెండున్నర సంవత్సరాలలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజల తీర్పు ఏవిధంగా ఉందో హరీష్‌రావుకు తెలుసు. ఇప్పుడు కొత్తగా వచ్చే తీర్పు ఏముంది? రెండుకాళ్లు లేనివాడు చూసుకుందాం రా.. అని సవాలు విసిరినట్లే బిఆర్ఎస్ నాయకుల సవాళ్లు ఉంటున్నాయన్నారు. ఈ ప్రభుత్వం చేసే మంచిపనులను జీర్ణించుకోలేక భవిష్యత్తులో అధికారం దక్కదనే ఆవేశం, ఆక్రోశంతో కేటీఆర్ ఉక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారు. నా నియోజకవర్గం పాలేరులో కేటీఆర్ విమర్శలు ఇదే కోవలోకి వస్తాయి. బిఆర్ఎస్ నాయకులు చేసే చిల్లర విమర్శలకు ప్రతిసారీ స్పందించను. ఎప్పుడో ఒకసారి కచ్చితంగా కర్ర కాల్చి వాత పెడతా. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తేనే బాంబులు పేలినట్టుకాదు. ప్రజలు ఛీ కొట్టినా బాంబులు పడ్డట్టే. ఏ వ్యక్తిమీదా వ్యక్తిగత కక్షపూరితమైన చర్యలు తీసుకోవాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. తప్పుచేసిన వాళ్ళను జైలులో వేస్తేనే శిక్షించినట్లు కాదు. ప్రతి ఎన్నికల్లో వాళ్లను ఓడించి ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారు. తమిళనాడు లాంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో తీసుకురాం. అధికారంలోకి వస్తామని బిజేపీ పగటికలలు కంటోంది. ఆశ ఉండడంలో తప్పులేదు కానీ ఆ పార్టీ అత్యాశకు పోతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కనీసం డిపాజిట్ రాని పార్టీ అధికారం గురించి ఆశ పడుతోంది. బిజేపీ, బిఆర్ఎస్ ఒకే తాను ముక్కలు. కాళేశ్వరం అవినీతి, ధర్మల్ పవర్ ఎ÷-లాంట్ అక్రమాలపై సిబిఐ విచారణ చేయాలని అడిగితే బిజేపీ ఇప్పటివరకు స్పందించలేదు. ఈ సారి రైతు భరోసా నిధులను అనుకున్నదానికంటే రెండు మూడు రోజుల ముందే వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో జమచేస్తాం. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటివరకు 18 నియోజకవర్గాలలో 23 స్థలాలను గుర్తించడం జరిగిందన్నారు. కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదు. భూముల ధరల సవరణలు ఎక్కడైనా పొరపాటుగా ఎక్కువ ధర నిర్ణయిస్తే సరిచేయడానికి సిద్దంగా ఉన్నాం. తాండూరులో ఇదే విధంగా జరిగితే సరిదిద్దడం జరిగింది. అని మంత్రి పొంగులేటి అన్నారు.

# ఉద్యోగులకు తీపికబురు

మొదటి తరువాయి

రిటైర్డ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ జేఏసీ నాయకులకు ఇచ్చిన హామీ మేరకు, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను 100 రోజుల్లో రూ. ఆరు వేల కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గత నెల 29న మొదటి విడతగా రూ.రెండు వేల కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. రెండో విడతలో మరో రూ.రెండు వేల కోట్ల నిధులను విడుదల చేసి తన నిబద్ధతను నిరూపించుకుంది. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నది. అందులో భాగంగా రిటైర్డ్ ఉద్యోగులు, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు సంబంధించిన జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) బకాయిలను వంద శాతం చెల్లించి, వారి ఖాతాలను పూర్తిగా క్లియర్ చేసినట్టు ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో ఎలాంటి పెండింగ్‌లు లేవని స్పష్టం చేసింది. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి గతేడాది సెప్టెంబర్ వరకు ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ ప్రభుత్వం పూర్తిగా చెల్లించిందని పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న రూ.పది వేలలోపు విలువ కలిగిన చిన్న మొత్తాల బిల్లులన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించిందని తెలిపింది. ఈ విభాగంలో దాదాపు ఐదు లక్షలకుపైగా ఉన్న టోకెన్లను గుర్తించి, ఏమాత్రం జాప్యం లేకుండా చెల్లింపులు జరిపినట్టు పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నేతలు సంతోషం వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం చూపుతున్న సానుకూల ధోరణి అభినందనీయమని తెలిపారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

## అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు..

**డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన**



**న్యూఢిల్లీ (జూన్ 29) జర్నలిస్ట్ డైరీ.**
అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరోసారి పెరుగుతున్నాయి. ఈ తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. తాజా అంశాలపై చర్చించేందుకు రావాలని ఇరాన్ కోరిందన్నారు. టెహ్రాన్ అభ్యర్థన మేరకు ఖతార్ రాజధాని దోహా వేదిగా మంగళవారం సమావేశం ఉంటుందని సోషల్ మీడియాలో ఆయన పోస్టు చేశారు. ఇరుదేశాల ప్రతినిధులు ఇందులో పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో తుది ఒప్పందంపైనా చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఖతార్‌లో ఈ వారం ఇరాన్, అమెరికా బృందాల మధ్య సమావేశాలు నిర్వహించే ప్రణాళికలేవీ లేవని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ ఘరిబబాడి పేర్కొన్నారు. తమ హామీల అమలుకు సంబంధించి అమెరికా తీసుకుంటున్న చర్యల పర్యవేక్షణ, ఖతార్‌తో సంప్రదింపులు యథావిధిగా కొనసాగుతున్నాయని అన్నారు. అయితే దోహాలో మంగళవారం ఇరుదేశాల ప్రతినిధుల మధ్య చర్చలు జరగనున్నట్లు వస్తున్న వార్తలను తాము ధ్రువీకరించలేమని తెలిపారు. పరిస్థితులు చక్కబడిన తర్వాతే చర్చలు జరుగుతాయని స్పష్టంచేశారు.

## రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఖర్గే..

**-తిరిగి ఎన్నికైన నేపథ్యంలో ఆ మేరకు గుర్తింపు**

**న్యూఢిల్లీ (జూన్ 29) జర్నలిస్ట్ డైరీ.**




కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా సోమవారం తిరిగి గుర్తించారు. రాజ్యసభకు మరోసారి ఎన్నికైన నేపథ్యంలో ప్రతిపక్ష నాయకుడిగా ఆయన తిరిగి నియమితులయ్యారు. జూన్ 25తో రాజ్యసభ సభ్యుడిగా మల్లికార్జున ఖర్గే పదవీకాలం ముగిసింది. దీంతో జూన్ 26 నుంచి రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఆయన కొనసాగలేదుకాగా, కాంగ్రెస్ అధ్యక్షుడైన మల్లికార్జున ఖర్గే మరోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. దీంతో సోమవారం రాజ్యసభ చైర్మన్ కార్యాలయంలో సభ్యుడిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా మల్లికార్జున ఖర్గేను మరోసారి గుర్తించారు. మరోవైపు రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. 'రాజ్యసభకు తిరిగి ఎన్నికైనందున, పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుల జీతభత్యాల చట్టం, సంబంధిత నిబంధనల ప్రకారం జూన్ 26 నుంచి అన్ని ప్రయోజనాలు అమలులోకి వచ్చేలా మల్లికార్జున ఖర్గేను రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా రాజ్యసభ చైర్మన్ గుర్తించారు' అని పేర్కొన్నారు.

## జర్మనీలో మాస్ షూటింగ్..

**-ఐదుగురి మృత్యువాత..!**

**(జూన్ 29) జర్నలిస్ట్ డైరీ.**



జర్మనీలో కాల్పులు కలకలం సృష్టించాయి. ఉత్తర జర్మనీలోని స్టేడ్ పట్టణంలో సోమవారం జరిగిన మాస్ షూటింగ్ లో ఐదుగురు మరణించారు. కాల్పుల ఘటనతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాల్పులతో సంబంధమున్న ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. మాస్ షూటింగ్‌కు కారణాలపై ఈ ఇద్దరిని పోలీసులు విచారిస్తున్నారు. స్టేడ్ పట్టణంలోని యువ కేంద్రం సమీపంలో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. సిటీ మధ్యలో ఉండే ఈ ప్రాంతంలో ఈమధ్య పెద్ద సంఖ్యలో కార్యకలాపాలు సాగుతున్నాయి. దాంతో, తుపాకులతో వచ్చిన కొందరు అక్కడి వారిపై కాల్పులు జరిపారు. ఒక్కసారిగా కాల్పుల మోతతో జనాలు భయభ్రాంతులకు లోనయ్యారు. బుల్లెట్ గాయాలతో ఐదుగురు చనిపోయారని ఏజెన్సీ ఫ్రాన్స్ ప్రెస్ (ఏఎఫ్‌పీఈ) వార్త సంస్థతో ఓ పోలీసు అధికారి చెప్పారు. సమాచారం అందగానే అక్కడి వెళ్లిన పోలీసులు.. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారని ఆయన తెలిపారు. ఈ ప్రాంతాన్ని వెంటనే ఖాళీ చేయండి. మీ ప్రాణాలు కాపాడుకోండి అని అక్కడి వారిని ఆదేశించినట్టు పోలీస్ అధికారి వెల్లడించారు.

## ఉత్తర జర్మనీలో కాల్పులు కలకలం

**ముంబై: (జూన్ 29) జర్నలిస్ట్ డైరీ.**



ఉత్తర జర్మనీలో కాల్పులు కలకలం సృష్టించాయి. స్టేడ్ పట్టణంలోని యువ కేంద్రం సమీపంలో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఐదుగురు మరణించారు. కాల్పుల ఘటనతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాల్పులతో సంబంధమున్న ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. సిటీ మధ్యలో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో తుపాకులతో వచ్చిన కొందరు అక్కడి వారిపై కాల్పులు జరిపారు. ఒక్కసారిగా కాల్పుల మోతతో జనాలు భయభ్రాంతులకు లోనయ్యారు. బుల్లెట్ గాయాలతో ఐదుగురు చనిపోయారని ఏజెన్సీ ఫ్రాన్స్ ప్రెస్ (ఏఎఫ్‌పీఈ) వార్త సంస్థతో ఓ పోలీసు అధికారి చెప్పారు. సమాచారం అందగానే అక్కడి వెళ్లిన పోలీసులు.. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారని ఆయన తెలిపారు.

# ఉలిక్కిపడిన బెంగళూరు

**ఒకే రోజు మూడు హత్యలు..**

**న్యూఢిల్లీ (జూన్ 29) జర్నలిస్ట్ డైరీ.**
ఒకే రోజు మూడు హత్యలు జరిగాయి. వేర్వేరుగా జరిగిన ఈ సంఘటనల్లో ఇద్దరు మహిళలు హత్యకు గురికాగా, ఒక నేరస్తుడ్ని పత్యర్థులు నరికి చంపారు. ఈ మూడు హత్యలతో రాజధాని నగరం ఉలిక్కిపడింది. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ మూడు సంఘటనలు జరిగాయి. ఆదివారం మహాలక్ష్మి లేఅవుట్‌లో మొదటి హత్య జరిగింది. పెళ్లి విషయంలో గొడవ కారణంగా 23 ఏళ్ల అంజలిని ఆమె ప్రియుడు రాజీవ్, కత్తితో పొడిచి హత్య చేశాడు. వీరిద్దరూ మూడేళ్లకు పైగా ప్రేమలో ఉన్నారని పోలీసులు తెలిపారు. అయితే రాజీవ్ నేర చరిత్ర కారణంగా ఆ యువతి కుటుంబం వారి సంబంధాన్ని




వ్యతిరేకించినట్లు తెలిసిందన్నారు. నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.కాగా, అదే రోజున కొన్ని గంటల్లోనే బొమ్మనహల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మునియప్ప లేఅవుట్‌లో మరో మహిళ హత్యకు గురైంది. అద్దె ఇంట్లో నివసిస్తున్న 40 కృష్ణ బర్మన్ గొంతు నులిమి చంపి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆమె హత్యపై దర్యాప్తు చేస్తున్నారు. ఆ మహిళ ఇటీవల ఎవరితో మాట్లాడింది? ఆమె కదలికలు, ఇతర వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. మరోవైపు ఆదివారం సాయంత్రం జేపీ నగర్ రోడ్డులోని ఐజీ సర్కిల్ సమీపంలో బహిరంగంగా మూడో హత్య జరిగింది. హత్య, హత్యాయత్నం, దోపిడీతో సహా పలు క్రిమినల్ కేసులున్న నేరస్థుడు రాజా అలియాస్ హల్కుక్ రాజాను కారులో వచ్చిన దుండగులు వెంబడించారు. కత్తులు, కొడవళ్లతో దాడి చేసి నరికి చంపారు. పాత కక్షలు, ప్రతీకార చర్యగా ప్రత్యర్థులు అతడ్ని హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఒకే రోజు మూడు హత్యలు జరుగడంతో బెంగళూరు వాసులు ఉలిక్కిపడ్డారు. రాజధాని నగరంలో శాంతిభద్రతలపై ఆందోళన చెందుతున్నారు.

# రాష్ట్రంలో అరు నెలల్లోపే అసెంబ్లీ ఎన్నికలు..

**-సిద్ధంగా ఉండాలని డీఎంకే శ్రేణులకు ఎంకే స్టాలిన్ పిలుపు.**

**న్యూఢిల్లీ (జూన్ 29) జర్నలిస్ట్ డైరీ.**
తమిళనాడు లో రాజకీయ పరిణామాలు వేగంగా మారే అవకాశం ఉందని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అన్నారు. మరో ఐదేళ్లు ఎదురుచూడాల్సిన అవసరం లేదని, మూడు నెలలు లేదా ఆరు నెల్లల్లో ఎన్నికలు రావొచ్చని పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. చెన్నై లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాజీ మంత్రి బెంజమిన్‌తో పాటు పలువురు ఏఐఏడీఎంకే నేతలు, కార్యకర్తలు డీఎంకేలో చేరారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వానికి సొంతంగా మెజారిటీ లేదన్నారు. 118 సీట్ల మెజారిటీ అవసరం కాగా ఆ పార్టీకి 108 స్థానాలే వచ్చాయని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇతర పార్టీల



మద్దతుతోనే కొనసాగుతోందన్నారు. ఇటీవల వరకు డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతుతోనే ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. అలాంటి ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేమన్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియదని వ్యాఖ్యానించారు. అందుకే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని స్టాలిన్ సూచించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత కాకుండా ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాలని కోరారు. డీఎంకేను మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. టీవీకే ప్రభుత్వంపై కూడా స్టాలిన్ విమర్శలు గుప్పించారు. గత నెల రోజులుగా రాష్ట్రంలో అభివృద్ధి మందగించిందన్నారు. పెట్టుబడిదారులు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారని అన్నారు. మహిళలపై నేరాలు, మాదకద్రవ్యాల కేసులు, దోపిడీలు, పెట్రోల్ బాంబు దాడులు, విద్యుత్ కోతలు పెరిగాయని విమర్శించారు. ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ కూడా ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు తమిళనాడులో ఉన్న సుపరిపాలన ఇప్పుడు కనిపించడం లేదన్నారు. ప్రజలు విద్యుత్, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం పాలన కంటే ప్రచారంపైనే ఎక్కువ దృష్టి పెడుతోందని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు సభలా కాకుండా సినిమా షూటింగ్‌లా మారిపోయాయని ఎద్దేవా చేశారు.

# మూడేళ్ల చిన్నారిపై హత్యాచారం..

**- 65 ఏళ్ల వృద్ధుడికి మరణశిక్ష**

**ముంబై: (జూన్ 29) జర్నలిస్ట్ డైరీ.**
మూడేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన 65 ఏళ్ల వృద్ధుడికి కోర్టు మరణశిక్ష విధించింది. ఈ నేరం అత్యంత క్రూరమైనదని న్యాయమూర్తి అభివర్ణించారు. అందుకే అత్యంత అరుదైన తీర్పు ఇచ్చినట్లు వెల్లడించారు. మహారాష్ట్రలోని పూణె జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మే 1న నస్రాపూర్ గ్రామానికి చెందిన మూడేళ్ల బాలిక అదృశ్యమైంది. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు.కాగా, 65 ఏళ్ల భీమ్‌రావ్ కాంబ్లే తినుబండారాల ఆశ చూపించి ఆ చిన్నారిని తీసుకెళ్లడం సీసీటీవీ ఫుటేజ్‌లో కనిపించింది. పసి దూడను చూపిస్తానని చెప్పిన వృద్ధుడు ఆ బాలికను పశువుల పాక సమీపంలోని షెడ్‌లోకి తీసుకెళ్లాడు. అక్కడ ఆ చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఆ బాలిక నోరు మూసి, ఛాతిపై గాయం చేసి




ఆమెను హత్య చేశాడు. చిన్నారి కోసం వెతకగా మృతదేహం అక్కడ లభించింది. మరోవైపు సీసీటీవీ ఫుటేజ్, ఇతర ఆధారాల సహాయంతో నిందితుడు భీమ్‌రావ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నారిపై హత్యాచారం కేసు దర్యాప్తు కోసం సిట్‌ను ఏర్పాటు చేశారు. పోలీసులు పగలతో పాటు రాత్రులు కూడా పని చేశారు. 15 రోజుల్లో కీలక ఆధారాలు సేకరించారు. 55 మంది సాక్షుల వాంగ్మూలాలు రికార్డ్ చేశారు. 1,200 పేజీల వివరణాత్మక ఛార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. కాగా, పూణే జిల్లా, సెషన్స్ కోర్టులో ఈ కేసుపై రోజువారీ విచారణ జరిగింది. మూడేళ్ల బాలిక కిడ్నాప్, లైంగిక వేధింపులు, అత్యాచారం, హత్య ఆరోపణల్లో నిందితుడు భీమ్‌రావ్ కాంబ్లేను దోషిగా కోర్టు నిర్ధారించింది. యావజ్జీవ కారాగార శిక్ష విధించాలన్న నిందితుడి తరఫు న్యాయవాది అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. ఈ కేసులో ఎలాంటి దయ లేదా ఉదారత చూపాల్సిన అవసరం లేదని కోర్టు అభిప్రాయపడింది. మరోవైపు సుప్రీంకోర్టు నిర్వచించిన 'అరుదైన వాటిలోకెల్లా అరుదైన' వర్గంలోకి ఈ నేరం వస్తుందని ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాదులు కోర్టులో వాదించారు. మరణశిక్షపై సుప్రీంకోర్టు ఇచ్చిన 12 కీలక తీర్పులను ప్రస్తావించారు. దీంతో ప్రాసిక్యూషన్ వాదనలతో కోర్టు ఏకీభవించింది. ఈ నేరంలోని క్రూరత్వానికి ఎలాంటి కనికారం చూపే ఆస్కారం లేదని న్యాయమూర్తి ఎస్.ఆర్. సలుంఖే వ్యాఖ్యానించారు. 'ఈ నేరం అత్యంత క్రూరమైనది. అరుదైన వాటిలో అత్యంత అరుదైనది. ఇది సమాజ అంతరాత్మనే కలచివేసేలా ఉన్నది. పసి బాలికపై తన కామ వాంఛ తీర్చుకునేందుకు నిందితుడు ఈ దారుణానికి పాల్పడ్డాడు' అని న్యాయమూర్తి అన్నారు. నేరం జరిగిన రెండు నెలల్లోపే దోషికి ఉరిశిక్ష విధిస్తూ సోమవారం తీర్పు ఇచ్చారు.

# అయోధ్య బార్ అసోసియేషన్ కీలక నిర్ణయం..

**నిందితుల తరపున వాదిస్తే 5 లక్షల ఫైన్**

**న్యూఢిల్లీ (జూన్ 29) జర్నలిస్ట్ డైరీ.**
అయోధ్య రామాలయంలో విరాళాలను దుర్వినియోగం చేసిన కేసులో 8 మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే అయోధ్య బార్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకున్నది. నిందితుల తరపున కేసును వాదించబోమని లాయర్ల సంఘం తీర్మానించింది. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాలికా ప్రసాద్ మిశ్రా మాట్లాడుతూ.. నిధుల చోరీ కేసులో నిందితులను తరపున ఎవరూ వాదించరు అని, ఒకవేళ వాదిస్తే వారికి 5 లక్షల జరిమానా విధించనున్నట్లు చెప్పారు. బార్ అసోసియేషన్ మరో నిర్ణయాన్ని కూడా తీసుకున్నది. రామాలయ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా, గోపాల్ రావు.. తక్షణమే అయోధ్య విడిచి వెళ్లాలని డిమాండ్ చేసింది.మూడు రోజుల్లోగా అయోధ్య నుంచి వెళ్లిపోకుంటే, అప్పుడు



సిటీని బ్లాక్ చేస్తామని, ఎవర్నీ లొపలికి రానివ్వకుండా చేస్తామని మిశ్రా తెలిపారు. అయితే ఈ ముగ్గురిలో ఏ ఒక్కరి పేరు కూడా ఎఫ్ఐఆర్‌లో నమోదు కాకపోవడం గమనార్హం. ఈ కేసులోని 8 మంది నిందితుల్లో అవినాశ్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్ కుష్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామ్ శంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాత్సవ, రామశంకర్ ఉన్నారు. నిందితులు అందరూ క్యాష్ కౌంటింగ్, విలువైన వస్తువులను భద్రత పరిచే ఉద్యోగంలో ఉన్నారు. ఈ కేసులో సీబీఐ విచారణ చేపట్టాలని బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సమగ్ర విచారణ కోసం సుప్రీంకోర్టు వరకు వెళ్లనున్నట్లు ప్రసాద్ మిశ్రా తెలిపారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రా ప్రస్తుతం ట్రస్టుకు రాజీనామా చేశారు. దానిపై జూలై 7వ తేదీన నిర్ణయించనున్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అదనపు గదుల భవనాన్ని ప్రారంభించిన గాంధీ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 29 (జర్నలిస్ట్ డైరీ) :**
వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వర నగర్ కాలనీ లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రౌండ్ టేబుల్ ఇండియా ఫౌండేషన్ మరియు చెన్నై షాపింగ్ మాల్ వారి సిఎస్ఆర్ నిధులతో నూతనంగా నిర్మించిన 4 అదనపు తరగతి గదుల భవనం ను ఎంఈవో రవీందర్ రాజు, ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు , విద్యార్థులతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన పియెసి చైర్మన్ అరెకపూడి గాంధీ.
ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... రౌండ్ టేబుల్ ఇండియా ఫౌండేషన్ మరియు సిఎస్ఆర్ చెన్నై షాపింగ్ మాల్ వారి నిధులతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన 4 అదనపు తరగతి గదులను ఈ రోజు ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, ఈ రోజు పాఠశాల కు పండుగ రోజు అని , విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని వారి బంగారు భవిష్యత్తుకు పునాది లాంటిది ప్రాథమిక విద్య అని, మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలియచేశారు. అన్ని హంగులతో , సకల సౌకర్యాలతో, కొత్త సొగసుల తో భవనం ను నిర్మించడం జరిగినది అని, పిల్లలకు ప్రశాంతమైన




వాతావరణంలో చదువుకునే విధంగా నిర్మించడం జరిగినది, సిఎస్ఆర్ ప్రతినిధులు దేవుడితో సమానం అని, ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారు అని, సామాజిక బాధ్యత గా ప్రతి ఒక్కరూ సేవ చేయాలని, పిల్లలు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, సమాజంకు మంచిపేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని, విద్యార్థులు ఒక మంచి లక్ష్యం ఏర్పరచుకొని, మంచి క్రమ శిక్షణ, ఏకాగ్రతతో, సడలని పట్టుదలతో ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలియచేశారు.
ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి విద్యారంగానికి ఎంతగానో కృషి చేస్తున్నారు అని, మియాపూర్ 10 ఎకరాలలో 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియన్ పాఠశాలకు ఇటీవలే శంకుస్థాపన చేసుకోవడం జరిగినది అని, త్వరలోనే పనులు ప్రారంభించుకోవడం జరుగుతుంది అని, మరియు కొండాపూర్ మరియు చందానగర్ లో కోర్ అర్బన్ పాఠశాలలను ఏర్పాటు చేయడం జరుగుతుంది అని, అన్ని ప్రభుత్వ పాఠశాలలను అన్ని హంగులతో , సకల సౌకర్యాలతో తీర్చిదిద్దుతామని, ప్రవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతామని తెలియచేశారు, తన వంతు సహాయ సహకారాలు అందిస్తాన ని, మీకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రౌండ్ టేబుల్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు అశోక్ అగర్వాల్, అనిరుద్ సోమ్ పల్లి,లోకేశ్వర్ రెడ్డి, అభిషేక్ అగర్వాల్, విదిష అగర్వాల్, దీపా శర్మ, శశం సబర్వాల్, రీటా అగర్వాల్, తేజస్విని రెడ్డి, చెన్నయ్ షాపింగ్ మాల్ పతినిధులు శంకర్, సంజయ్ మరియు హెడ్ మాస్టర్ ఆంజనేయులు నాయకులు సంజీవ రెడ్డి, హరినాథ్, చంద్రమోహన్ సాగర్,సత్యనారాయణ, లక్ష్మీనారాయణ,వెంకట స్వామి సాగర్, వెంకట్, రాజు మరియు ఉపాధ్యాయులు,విద్యార్థులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఏ విధంగానూ సమర్థించలేని భారత (మోదీ) విదేశాంగ విధానం.

భారత విదేశాంగ విధానాన్ని ఎవరు రూపొందిస్తారు అన్నది పెద్ద అనుమానంగా తయారైంది. మోదీ నడవడిక చూస్తే మన విదేశాంగ విధానాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్దేశిస్తున్నారనిపిస్తోంది. ఒక వైపున ఇరాన్ అమెరికా సైనిక స్థావరాలున్న అనేక దేశాలపై క్షిపణుల వర్షం కురిపిస్తోంది. ఇజ్రాయెల్ మీద క్షిపణులతో దాడి చేస్తోంది. టర్కీ గగనతలంలోకి ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు నాటో కూటమి వైమానిక రక్షణ వ్యవస్థను నాశనం చేశాయి. ఒక్క చైనా కోసం తప్ప ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసేసింది. చైనా తమకు మద్దతిస్తున్నందు వల్ల చైనా నౌకలను మాత్రం అనుమతిస్తామని ఇరాన్ చెప్తోంది. ఇది మన దేశానికి అంత సానుకూల పరిణామం ఏమీ కాకపోవచ్చు. దీనివల్ల చమురు ఎగుమతులకు తీవ్ర విఘాతం కలగక తప్పదు. మన దేశంలో చమురు నిలవలు 25 రోజులకు మాత్రమే సరిపోతాయంటున్నారు. అయితే పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింఘ్ పురి షరా మామూలుగా ఈ మాటను ఖండిస్తున్నారు. ఇరాన్ మీద యుద్ధం ప్రారంభించినప్పటి నుంచి హర్దీప్ పురి జాడ లేకుండాపోయారు. యుద్ధం మొదలై బుధవారం నాటికి అయిదు రోజులు. ఈ యుద్ధం త్వరగా ముగుస్తుందని ఇరాన్ ను సునాయాసంగా లొంగ దీయవచ్చునని ట్రంప్ మొదట భావించారు. కానీ ఇరాన్ ప్రతిఘటిస్తున్న తీరు చూస్తుంటే యుద్ధం దీర్ఘకాలమే కొనసాగేట్టు కనిపిస్తుంది. ఇజ్రాయెల్, ఇరాన్ దాడులు ముగిసిన తరవాత ఇరాన్ ప్రభుత్వంలోని ఎవరో ఒకరు అధికారం చేపట్టడం మంచిదని ట్రంప్ అంటున్నారు. ఒకవేళ అదే నిజమైతే ఇరాన్ అధినేత అయతుల్లా ఖామేనీని హతమార్చడంతో ఇజ్రాయెల్, అమెరికాకసితీరి ఉండాలి. కానీ అదే సమయంలో యుద్ధం కొనసాగిస్తున్న రెండు దేశాలూ ఇరాన్ లో అధికారం మారాలని ముందు నుంచి చెప్తూనే ఉన్నాయి. అంటే ఇరాన్ లో అమెరికా చెప్పుచేతుల్లో ఉండే ప్రభుత్వం నెలకొనే దాకా వారిద్దరూ నిద్రపోయేట్టు లేరు. ఈ యుద్ధం వల్ల పశ్చిమాసియాకు నష్టం కలిగించడమే కాక భారత్ కు కూడా కష్టాలు తప్పవు. ఇండియా, చైనా దేశాల ఎదుగుదలను నిలవరించడానికే అమెరికా యుద్ధానికి మరింత ఆజ్యం పోస్తోందని ఇరాన్ దౌత్యవేత్త మజీద్ హాకీం ఇలాహీ అంటున్నారు. ఇరాన్ లో ఇప్పటికి దాదాపు 800మంది యుద్ధానికి బలయ్యారు. ఇరాన్ మీద జరుగుతున్న యుద్ధం కేవలం భౌగోళిక రాజకీయ ఘటన మాత్రమే కాదు. చమురు దిగుమతి చేసుకునే దేశాలన్నింటికీ సంకటమే. మన దేశంలో చమురు మార్కెట్లు, రసాయనిక ఎరువుల సరఫరా, నౌకాయానం, శీతోష్ణ స్థితి, పరిరక్షణ లక్ష్యాలు మొదలైన అనేక అంశాల మీద యుద్ధ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. చమురు దిగుమతికి సంబంధించిన ఏ ఆటంకం అయినా మన ఆర్థిక వ్యవస్థను కుంగదీస్తుంది. చమురుకు బదులు విద్యుత్తు, తరగని ఇంధనం మొదలైనవన్నీ శీతోష్ణ స్థితి పరిరక్షణలో మన లక్ష్యాలకు విఘాతం కలిగిస్తాయి. మరీ మాట్లాడితే భద్రతకు కూడా ముప్పు ఉండవచ్చు. మనకు అవసరమయ్యే ముడి చమురులో 85-90 శాతం దిగుమతి చేసుకుంటాం.
ఇందులో చాలా భాగం హోర్ముజ్ జలసంధి ద్వారానే రావాలి. చమురు ధర బ్యారెల్ కు పది డాలర్లు పెరిగినా అది మనకు మోయలేని భారమే. ఇంధనం, రవాణా, పెట్రో రసాయనాల ధరలు అమాంతం పెరిగిపోతాయి. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్ మీద అధర్మ యుద్ధం ప్రారంభించినా మన "విశ్వగురువు" మోదీ మౌన ముద్రలోనే ఉంటారు. పైగా అమెరికా సైనిక స్థావరాల మీద ఇరాన్ దాడులు చేస్తే దాన్ని విశ్వగురువు సహించలేదు. పైగా ఆ దేశాలకు సానుభూతి తెలియజేశారు. అంటే ఇరాన్ మీద యుద్ధం సబబైందేనని విశ్వగురువు భావన. 2020లో ఓ ఇరాన్ కమాండర్ ను మరో దేశంలో డ్రోన్ దాడితో హతమారిస్తే విశ్వగురువు ఇదేమని అడగనే లేదు. అది ఇరాన్ సార్వభౌమాధికారాన్ని కాలరాయడమే. ఇజ్రాయెల్ పాలస్తీనా మీద మారణహోమం కొనసాగించినా మన విశ్వగురువు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కాల్పుల విరమణను ఇజ్రాయెల్ అనునిత్యం ఉల్లంఘించినా విశ్వగురువు మాట్లాడరు. పైగా యుద్ధం ప్రారంభం కావడానికి రెండు రోజుల ముందు ఇజ్రాయెల్ కు వెళ్లి వచ్చారు. రెండు దేశాలు కలిసి విడుదల చేసిన సంయుక్త ప్రకటన ఏదీ లేదు. అలాంటప్పుడు "విశ్వగురువు" ఇజ్రాయిల్ వెళ్లి ఏం సాధించుకొచ్చినట్టు!? స్వతంత్ర దేశమైన వెనిజులా అధ్యక్షుడు మదురోను, ఆయన భార్యను అమెరికా అపహరించుకు వెళ్లినా విశ్వగురువు నోరు తెరవలేదు. అమెరికాలో సరైన పత్రాలు లేకుండా ఉన్న భారతీయులను ట్రంప్ కాళ్లు చేతులు కట్టేసి అమెరికా సైనిక కార్గో విమానాల్లో కుక్కి పంపినప్పుడూ విశ్వగురువుకు ఏ మాత్రం అవమానంగా భావించలేదు. ఇదేమిటని ప్రశ్నించలేదు. చిన్నపాటి నిరసనో, ఖండనో లేదు. మన మీద ట్రంప్ అడ్డగోలు సుంకాలు విధించినప్పుడూ విశ్వగురువు నోరు తెరిచే సాహసం చేయలేదు. పైగా సాష్టాంగ పడిపోయారు. పెంచిన సుంకాలను తరవాత కొంత తగ్గించి ఉండొచ్చు. కానీ అంతకు ముందుకన్నా ఎక్కువే (18 శాతం). అదీకాక అమెరికా మీద మనం ఒక్క రూపాయి సుంకం కూడా విధించం (జీరో ట్యాక్స్) . భారత్ విశ్వగురువు అవుతుందని, నాగరికతలో మనమే ప్రపంచానికి గురువులమని, వివేకం, శాంతి, సామరస్యాలను అందించే సత్తా మనకు మాత్రమే ఉందని విశ్వగురువు అలసట లేకుండా చెప్తూనే ఉంటారు. నిరంకుశంగా స్వతంత్ర దేశాల మీద అమెరికా విరుచుకుపడితే విశ్వగురువు నోట మాటే పెకలదు. మనమే విశ్వగురువులం అని ఢంకా బజాయించి చెప్పినా కీలక సమయాల్లో మోదీ మౌనంగా ఉండిపోతారు. మోదీ ఎదుట ఉన్న మైక్రోఫోన్లు పలకవు. ఇది దౌత్యపరమైన మౌనం కాదు. దశాబ్దాల నుంచి మనం
ఏ విలువల కోసమైతే పాటు పడ్డామో వాటన్నింటినీ పాతరేయడమే. ఒకప్పుడు భారత అధినేతలు మాట్లాడితే అది సింహ గర్జనలా ప్రతిధ్వనించేది. సామ్రాజ్యవాదానికి లొంగే ప్రసక్తే లేదని దిక్కులు పిక్కటిల్లేలా మన నాయకులు ప్రకటించేవారు. అలీనోద్యమ నిర్మాతగా, ప్రవక్తగా అద్వితీయమైన పాత్ర పోషించిన ఘనత మనది. పలస్తీనా నడిగడ్డలో అక్రమంగా ఇజ్రాయెల్ ను ఏర్పాటుచేస్తే గట్టిగా వ్యతిరేకించిన దేశం ఇది. దక్షిణాఫ్రికాలో జాతి వివక్షను తూర్పార పట్టాం. మానవ గౌరవానికి ఎక్కడ ప్రమాదం ఎదురైనా నిటారుగా నిలబడి ఎదిరించిన దేశం ఇది. కానీ మోదీ హయాంలో ఇప్పుడు అన్నింటికీ మౌనమే వహిస్తాడు. లేదా పూర్తిగా ట్రంప్ కు లొంగిపోవడమే. కాకపోతే దురాక్రమణకు పాల్పడే యుద్ధోన్మాదులను సమర్థించడమే. విశ్వగురువు మోదీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తుంది. ఈ లొంగుబాటు దేనికోసం? మోదీ ప్రధాన మంత్రి హోదాలో "భారత వెన్నెముకను విరిచేశారు" . ఈ లొంగుబాటు, ఈ మౌనం హఠాత్పరిణామాలేమీ కాదు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడే తన వ్యక్తిగత వెన్నెముకతో పాటు... భారత దేశ పరువు, ప్రతిష్టలను మోదీ అమెరికాకు ((ట్రంప్) కు తాకట్టు పెట్టేశారు. చివరకు భారత సరుకుల రవాణా చేసే నావలపై స్పష్టంగా భారత జెండా ఎగురుతున్నా... అమెరికా ఉద్దేశపూర్వకంగా బాంబులతో దాడిచేసి హర్మోజ్ సమీపంలో మన నౌకాదళ సిబ్బందిలో ముగ్గురి ప్రాణాలు తీసింది. దీనికి కూడా మోదీ మోనం పాటించారు. కనీసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ కు సారి కూడా చెప్పలేదు. మోదీ నోరు తెరిచి భారత్ తరపున గట్టిగా ఎదిరించి మాట్లాడ లేదు. ఇదే పని భారత్ అమెరికా నౌకాదళం పై దాడి చేస్తే ఊరుకునేదా? కనీసం మన నౌకాదళ సిబ్బంది కుటుంబ సభ్యులకు క్షమాపణలు కానీ నష్ట పరిహారం కానీ మోదీ స్వయంగా డిమాండ్ చేయలేదు. ఇంత చేవచ్చిన ప్రధాని భారత దేశంలోనే కాదు. ప్రపంచంలో ఎక్కడా కనిపించరు. మొన్న ఇటలీ ప్రధాని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ను తనతో ఫొటో దిగడానికి తొందర పడింది అని ట్రంప్ కామెంట్ చేయగానే ఆడ సివంగిలా ట్రంప్ కు ఘాటుగా సమాధానం ఇచ్చింది. ఆదేశ ప్రతిపక్ష సభ్యులు కూడా ఆమెకు మద్దతుగా నిలిచారు. 146 కోట్ల ప్రజలకు 3 సార్లు భారత ప్రధానమంత్రిగా నిలిచిన మోదీ ఇంత పిరికివాడుగా ఎందుకు వ్యవహరిస్తున్నాడు? ఇందుకు మోదీకి సంబంధించిన , లేదా అతనికి సన్నిహిత మిత్రులకు సంబంధించిన ఏవో వ్యక్తి గత గుట్టు, సమాచారం , ఆధారాలు బలమైనవి బహుశా ట్రంప్ దగ్గర ఉండి ఉంటాయి. అందుకే మోదీని అంతర్జాతీయ మీడియా ముందు అనేక సార్లు వ్యక్తి గతంగా అవమానం చేస్తూ వ్యాఖ్యలు చేసినా... మోదీ నోరు మెదపలేదు లేదు. పైగా తాను తలచుకొంటే మోదీని ఐదు నిమిషాల్లో గద్దె దింపుతా అని కూడా ట్రంప్ బాహాటంగా ప్రకటించాడు. అయినా ట్రంప్ ముందు మోదీ నోరు పెగలదు. ఈ అవమానం కేవలం మోదీకి వ్యక్తి గాయమైంది అయితే కావచ్చు. కిడ్నీ ఇది భారత దేశ ప్రధానమంత్రికి సంబంధించిన పరువు ప్రతిష్టల సమస్య. బీజేపీ లో, మోదీ అంధ భక్తుల కూడా ఈ విషయంలో ఏమీ మాట్లాడరు. కనీసం బీజేపీ మాత్రు సంస్థ ఆరెస్సెస్ కూడా ఎందుకు మాట్లాడటం లేదు? వీళ్ళ చెప్పే శ్రీరంగ నీతులు...దేశ భక్తి..అంతా ..హుళ్ళక్కినేనా!?
భారత దేశం ప్రజలు, మేధావులు, భారత ప్రధాన మీడియా కూడా ఈ విషయంలో క్షుణ్ణంగా అధ్యయనం చేసి సమాధానం చెప్పాలి.
డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com .

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ దెబ్బతినడం వలన చేపడుతున్న మరమ్మత్తు పునరుద్ధరణ పనులను అర్ధరాత్రి పరిశీలించిన గాంధీ.



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 29 (జర్నలిస్ట్ డైరీ) :**
శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదు బండ లో ప్రధాన రహదారి పై 450 ఎంఎం డయా అర్సీసీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ దెబ్బతినడం వలన చేపడుతున్న మరమ్మత్తు పునరుద్ధరణ పనులను సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్ మరియు జలమండలి అధికారులతో కలిసి అర్థరాత్రి స్వయంగా పరిశీలించిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ .
ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ పగిలిపోవడం వలన సమస్య తలెత్తింది అని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ మరమ్మత్తు పునరుద్ధరణ పనులలో వేగం పెంచాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని, పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని, అర్ధరాత్రి వరకు స్వయంగా దగ్గర ఉండి పరిశీలించడం జరిగినది. ఆ అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగినది. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలియచేసారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ మరమ్మత్తు పునరుద్ధరణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదు అని, ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా చూడలని, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, భవిష్యత్తు లో మళ్ళీ పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలియచేసారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్,రాజు యాదవ్, మల్లేష్ యాదవ్, కోడిచెర్ల రాములు, మల్లేష్, ,రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపారం అభివృద్ధి చెందాలి

**-బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్**

**-కొత్తపేటలో బాలాజీ బేకరీని ప్రారంభించిన రవీందర్ యాదవ్**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 29 (జర్నలిస్ట్ డైరీ) :**
కేశంపేట మండలం కొత్తపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలాజీ బేకరీని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బేకరీ యజమాని మూడవత్ శంకర్ కి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ, ఈ బేకరీ విజయవంతంగా కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హరి శేఖర్, మాజీ సర్పంచ్ నవీన్ కుమార్, మాజీ ఎంపీటీసీ మల్లేష్ యాదవ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు జమాల్ ఖాన్, ఉప సర్పంచ్ దర్శన్, నాయకులు సాజిద్, గణేష్ గౌడ్, నరేష్ యాదవ్, సంతోష్ కుమార్, రాజు, సురేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# బోగారంను కీసర డివిజన్ లో కలపాలి...

**- మేడ్చల్ కలెక్టర్ కు వినతి....**




**నాగారం, జూన్ 29:-(జర్నలిస్ట్ డైరీ)**
బోగారం గ్రామాన్ని కీసర డివిజన్ లో కలపాలని సోమవారం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కు బిజెపి కిసాన్ మోర్చా రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిచేలిమి కృష్ణ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసారు. బోగారం గ్రామాన్ని కీసర డివిజన్ పరిధిలోకి మార్చాలని కోరుతూ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేసినట్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. గ్రామ ప్రజల పలు సమస్యల పరిష్కారానికి, పరిపాలనా సౌలభ్యం కోసం ఈ విజ్ఞప్తి చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

## అక్రమ నిర్మాణాలపై
# చర్యల్లో నిర్లక్ష్యం...

**- జోనల్ కమిషనర్‌కు అక్కల సురేష్ కుమార్ ఫిర్యాదు....**




**నాగారం, జూన్ 29:-(జర్నలిస్ట్ డైరీ)** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ, శివసేన తెలంగాణ మెడ్చల్ ఇన్‌చార్జ్ అక్కల సురేష్ కుమార్ ఉప్పల్ జోన్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో జోనల్ కమిషనర్ రాధికా గుప్తాకు లిఖితపూర్వక ఫిర్యాదు చేసారు. అక్రమ నిర్మాణాలపై ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, నాగారం డివిజన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఏసీపీ రాజీవ్ రెడ్డికి పలుమార్లు ఫిర్యాదు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకోలేదని ఆయన తెలిపారు. మై క్యూర్ యాప్, అధికారిక గ్రీవెన్స్ పోర్టల్, ఇన్‌వార్డ్ ఫిర్యాదులు, 'ఎక్స్' ద్వారా కూడా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. అధికారుల జాప్యం వల్ల అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం, భవన నిర్మాణ నిబంధనలపై ప్రజల్లో విశ్వాసం తగ్గుతోందని ఆయన అన్నారు. సంబంధిత అధికారుల పనితీరుపై స్వతంత్ర విచారణ జరిపి, నిర్లక్ష్యం నిర్ధారణ అయితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను ఆయన కోరారు.

## మహిళలకు వరంగా
# ఇందిరమ్మ చీరలు

**- ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి...**



**నాగారం, జూన్ 29:-(జర్నలిస్ట్ డైరీ)** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి, సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఉప్పల్ డివిజన్ పరిధిలోని ఉప్పల్ హిల్స్ లో సోమవారం చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీకి రజిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గతంలో నాసిరకం చీరలు ఇచ్చి మహిళల గౌరవాన్ని తగ్గించారని, కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత నాణ్యమైన, చేనేత కార్మికులు రూపొందించిన చేనేత వస్త్రాలను 'ఇందిరమ్మ సారె'గా అందిస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తోందని కొనియాడారు. సోనియా గాంధీ ఆశయాల స్ఫూర్తితో మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక విప్లవాత్మక పథకాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. ప్రతి ఆడబిడ్డకు ఈ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా తాము నిరంతరం శ్రమిస్తామని భరోసా ఇచ్చారు. మహిళల ఆర్థిక సాధికారతే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. అర్హులైన మహిళలంతా ఇందిరమ్మ చీరలు తీసుకోవాలని కోరారు. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా కోటీశ్వరులు కావాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో దుర్గం నవీన్ యాదవ్, గోవింద్, శ్రీనివాస్ రెడ్డి, సల్లా ప్రభాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కుమార్, కుమార్ స్వామి, అక్కు రవి, ఆర్ పి దివ్య, అర్చన, దుర్గం రేణుక, శ్రావణి,తదితరులు పాల్గొన్నారు.

## టీచర్స్ కాలనీలో
# సర్ ఓటరు ఇంటింటి సర్వే...

**పాల్గొన్న బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆలేటి మహిపాల్**



**నాగారం, జూన్ 29:-(జర్నలిస్ట్ డైరీ)** సర్ ఓటరు జాబితా ప్రత్యేక ఇంటింటి సర్వే కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి చెర్లపల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆలేటి మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం టీచర్స్ కాలనీలో కార్యక్రమం జరిగింది. బిఎల్ఓ అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటరు నమోదుపై కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉమ్మడి చర్లపల్లి డివిజన్ బి ఆర్ ఎస్ నాయకులు కటింగ్ కాలనీ పెద్దలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వాసానికి గాయం

అయోధ్య రామమందిరం కేవలం ఒక ఆలయం కాదు. కోట్లాది హిందువుల ఆధ్యాత్మిక విశ్వాసానికి, దశాబ్దాల ఉద్యమానికి, సాంస్కృతిక భావోద్వేగానికి ప్రతీక. అలాంటి పవిత్ర స్థలంలో భక్తులుసమర్పించిన హుండీ నగదు, బంగారం, వెండి, ఆభరణాల దుర్వినియోగం లేదా దొంగతనం జరిగిందనే ఆరోపణలు వెలుగులోకి రావడం దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు కారణమైంది. ఇది కేవలం ఒక క్రిమినల్ కేసు కాదు; ప్రజల విశ్వాసం, మత సంస్థల పారదర్శకత, అధికార వ్యవస్థల జవాబుదారీతనంపై నిలిచిన ప్రశ్న.ఇటీవల నమోదైన కేసుల ప్రకారం, ఆలయ విరాళాల నిర్వహణలో భాగమైన ఎనిమిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేశారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రాథమిక నివేదిక ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నట్లు వార్తలు వెల్లడించాయి. కొంత నగదు కూడా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. దర్యాప్తులో నగదు లెక్కింపు విధానాలు, సీసీటీవీ పర్యవేక్షణ, ఉద్యోగుల నియామకాలు, హుండీల భద్రత వంటి అంశాల్లో తీవ్రమైన లోపాలు బయటపడ్డాయని పలు జాతీయ మీడియా సంస్థలు నివేదించాయి. అయితే ప్రజల్లో ఎక్కువ చర్చకు దారి తీసింది దొంగతనం ఆరోపణల కంటే దర్యాప్తు దిశ. అత్యంత భద్రతా వలయంలో ఉండే రామమందిరంలో, వందలాది సీసీటీవీ కెమెరాలు, కఠిన నియంత్రణలు, బహుళస్థాయి పర్యవేక్షణ వ్యవస్థలు ఉన్నప్పుడు కేవలం కొంతమంది ఉద్యోగులు లేదా నగదు లెక్కించే సిబ్బంది మాత్రమే ఈ స్థాయి అవకతవకలకు పాల్పడగలరా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అధికారికంగా ఇప్పటివరకు ఎలాంటి ఉన్నతస్థాయి వ్యక్తులపై అభియోగాలు రుజువు కాలేదు. కానీ ప్రజల్లో అనుమానాలు మాత్రం కొనసాగుతున్నాయి. అవి నిజమా కాదా అన్నది కోర్టులు, దర్యాప్తు సంస్థలే తేల్చాలి. కానీ ఈ అనుమానాలు ఎందుకు ఉద్భవిస్తున్నాయో కూడా అర్థం చేసుకోవాలి.దర్యాప్తులో కొందరు ట్రస్ట్ సభ్యులు, ముఖ్య బాధ్యతలలో ఉన్న వ్యక్తులు రాజీనామా చేసినట్లు వార్తలు వచ్చాయి. ట్రస్ట్ స్వయంగా "నిష్పక్షపాత దర్యాప్తుకు సహకరిస్తాం" అని ప్రకటించింది. ఈ పరిణామాలు వ్యవహారం సాధారణ పరిపాలనా లోపం కాదనే సంకేతాన్ని ఇస్తున్నాయి. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. ప్రజాస్వామ్యంలో ఆరోపణలు, అనుమానాలు, రాజకీయ వ్యాఖ్యలు ఒకటి; నిరూపితమైన వాస్తవాలు మరొకటి. ప్రతిపక్ష నాయకులు ఈ అంశాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. కొందరు దీనిని హిందూ సమాజానికి జరిగిన మోసంగా అభివర్ణిస్తుండగా, మరికొందరు ప్రభుత్వ పర్యవేక్షణ వైఫల్యంగా చిత్రీకరిస్తున్నారు. కానీ రాజకీయ విమర్శలతోనే సత్యం తేలిపోదు. అదే సమయంలో అధికారిక ప్రకటనలతోనే ప్రజల అనుమానాలు కూడా తొలగిపోవు.దేశీయ, అంతర్జాతీయ మీడియా ఈ వ్యవహారాన్ని కేవలం దొంగతనం కేసుగా కాకుండా "పారదర్శకత సంక్షోభం"గా చూస్తోంది. ఎందుకంటే అయోధ్య రామమందిరం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మతపరమైన ప్రాజెక్టు. కోట్లాది రూపాయల విరాళాలు ప్రతిరోజూ వస్తున్న నేపథ్యంలో వాటి నిర్వహణపై అత్యున్నత ప్రమాణాల పారదర్శకత అవసరం. విరాళాల లెక్కింపు, బ్యాంకులకు బదిలీ, ఆభరణాల రికార్డింగ్, ఆడిట్ వ్యవస్థలు అన్నీ ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉండాలి. సోషల్ మీడియా, రెడ్డిట్ వంటి వేదికలలో అయితే మరింత తీవ్రమైన ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఇది కేవలం దిగువస్థాయి ఉద్యోగుల పని కాదని, మరింత విస్తృతమైన బాధ్యతా వైఫల్యం ఉండవచ్చని వాదిస్తున్నారు. మరికొందరు దర్యాప్తు పూర్తి కాకముందే పెద్ద ఎత్తున రాజకీయ నిర్ధారణలకు వస్తున్నారు. అయితే సోషల్ మీడియా వ్యాఖ్యలను నిర్ధారిత సాక్ష్యాలుగా పరిగణించలేమని గుర్తుంచుకోవాలి. అవి ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించవచ్చు గానీ, న్యాయపరమైన సత్యాన్ని కాదు.ఈ సంఘటన మరో పెద్ద ప్రశ్నను లేవనెత్తుతోంది. భారతదేశంలోని దేవాలయాలు, మఠాలు, చర్చిలు, మసీదులు, గురుద్వారాలు వంటి మత సంస్థల ఆర్థిక నిర్వహణ ఎంత పారదర్శకంగా ఉంది? భక్తుల విరాళాలు ఎలా వినియోగించబడుతున్నాయి? వార్షిక ఆడిట్ నివేదికలు ఎంతవరకు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి? మతం పేరుతో నడిచే సంస్థలు ప్రజా విశ్వాసాన్ని పొందుతున్నప్పుడు, వాటి జవాబుదారీతనం కూడా అంతే స్థాయిలో ఉండాలి.రామమందిరం వంటి అత్యంత ప్రతిష్ఠాత్మక సంస్థ విషయంలో ఈ ప్రమాణాలు మరింత కఠినంగా ఉండాలి. ఎందుకంటే ఇది కేవలం ఒక మత సంస్థ మాత్రమే కాదు; దేశ రాజకీయాలు, సంస్కృతి, చరిత్ర, సామాజిక భావోద్వేగాలతో ముడిపడి ఉన్న చిహ్నం. అందువల్ల చిన్న లోపం కూడా పెద్ద సంక్షోభంగా మారుతుంది.
ఈ వివాదంలో అత్యంత బాధాకరమైన అంశం ఏమిటంటే, భక్తులు సమర్పించిన ప్రతి రూపాయి వెనుక ఒక విశ్వాసం ఉంటుంది. కొందరు తమ సంపాదనలో భాగం ఇస్తారు. కొందరు జీవితకాల పొదుపులను సమర్పిస్తారు. మరికొందరు భక్తి భావంతో బంగారం, వెండి, ఆభరణాలు అందిస్తారు. అలాంటి విరాళాల నిర్వహణలో అవకతవకల ఆరోపణలు రావడం ఆర్థిక నష్టానికి మించిన నైతిక నష్టం.కాబట్టి ఈ వ్యవహారంలో అసలు అవసరం రాజకీయ ఆరోపణలు కాదు, సంపూర్ణ సత్యావిష్కరణ. అరెస్టయిన వ్యక్తులు మాత్రమే బాధ్యులా? లేక పర్యవేక్షణలో ఉన్నతస్థాయి వైఫల్యాలు కూడా ఉన్నాయా? భద్రతా వ్యవస్థలు ఎందుకు విఫలమయ్యాయి? సీసీటీవీ పర్యవేక్షణలో లోపాలు ఎలా వచ్చాయి? బాధ్యత ఎక్కడ ఆగుతుంది? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాలి. రాముడి పేరు మీద నిర్మితమైన ఆలయంలో జరిగిన ఈ వివాదం చివరకు ఒకే సందేశాన్ని ఇస్తోంది. విశ్వాసం సంపాదించడం కష్టం; కోల్పోవడం చాలా సులభం. భక్తుల విశ్వాసాన్ని కాపాడాలంటే న్యాయం జరిగిందని చెప్పడం సరిపోదు. న్యాయం జరిగిందని ప్రజలకు అనిపించాలి. అదే అయోధ్యకు, అదే రామమందిరానికి, అదే భారత ప్రజాస్వామ్యానికి ఇప్పుడు ఉన్న అతిపెద్ద పరీక్ష.

**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**

# సర్ ప్రక్రియ పారదర్శకంగా సాగేలా చూడాలి...

**- ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి...**



**నాగారం, జూన్ 29:-(జర్నలిస్ట్ డైరీ)** భారత ఎన్నికల సంఘం చేపట్టిన "సర్" సాఫీగా సాగేలా చూడాలని ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సోమవారం ఉప్పల్ డివిజన్ పరిధిలోని భరత్ నగర్‌లో విస్తృతంగా పర్యటించి క్షేత్ర స్థాయిలో "సర్" ప్రక్రియ తీరును పరిశీలించారు. కాలనీలలో విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులను (బీఎల్‌ఓలు) కలిసి 'సర్' ప్రక్రియ ఏ విధంగా జరుగుతోంది, నమోదు మరియు మార్పుల ప్రక్రియ ఎక్కడివరకు వచ్చింది, ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తోంది అనే విషయాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిజమైన ప్రతి ఓటరుకు ఈ ప్రక్రియతో అన్యాయం జరుగకుండా చూడాలని, ఎలాంటి లోపాలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ తిరుగుతున్న బూత్ స్థాయి అధికారులను (బీఎల్‌ఓలను) కలిసి, భరత్ నగర్‌లో సర్వే ఏ విధంగా జరుగుతోందో అడిగి తెలుసుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది సామాన్యుడికి ఉన్న అతిపెద్ద ఆయుధమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ శ్రేణులు ఈ ప్రక్రియలో పూర్తి బాధ్యతతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా అర్హులైన, నిజమైన ఒక్క ఓటరు పేరు కూడా పొరపాటున ఓటర్ల జాబితా నుండి తొలగిపోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి అక్రమాలు, బోగస్ ఓట్లు లేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఈ సర్ సవరణ ప్రక్రియ జరగాలని డిమాండ్ చేశారు. ఓటర్ల సవరణ లేదా కొత్తగా నమోదు చేసుకునే ప్రక్రియలో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి సులభంగా అవగాహన కల్పించేలా మన బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఎలు) సహాయపడాలని సూచించారు.

# కొత్తపల్లిలో భక్తిశ్రద్ధలతో గీతా పారాయణం



**యాచారం, (జూన్ 29) జర్నలిస్ట్ డైరీ.** మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. విష్ణు సహస్రనామ బృందం చంపాపేట ఆధ్వర్యంలో గ్రామం లోని ధర్మశాలలో నిర్వహించిన శ్రీమద్భగవద్గీతా పారాయణం కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన మహిళలు, యువత, వృద్ధులు సహా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గీతా పారాయణంలో భాగస్వాములై ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు.కార్యక్రమం ప్రారంభానికి ముందు ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీకృష్ణ భగవానునికి మంగళహారతులు సమర్పించారు. అనంతరం విష్ణు సహస్రనామ బృందం సభ్యులు శ్రీమద్భగవద్గీతలోని వివిధ అధ్యాయాలను పారాయణం చేయగా, గ్రామస్థులు భక్తిపూర్వకంగా శ్లోకాలను అనుసరిస్తూ పారాయణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సోమ రంగయ్య, సత్యనారాయణ మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించి, ప్రతి పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొనే శక్తి గీతా బోధనల ద్వారా లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సోమ రవి, నరేష్, జిల్లెల్ల యాదిరెడ్డి, మల్ రెడ్డి విష్ణు రెడ్డి, సోమ అరుణమ్మ, లక్ష్మి, సంగీత పద్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# న్యాయవ్యవస్థకు స్వేచ్ఛతో పాటు జవాబుదారీతనమూ అవసరమే

భారత ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ అంతిమ ఆశ్రయం. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు విఫలమైన సందర్భాల్లో కూడా ప్రజలు న్యాయస్థానాలనే ఆశ్రయిస్తారు. ఆ విశ్వాసానికి మూలం న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యం. అయితే స్వాతంత్ర్యం అంటే జవాబుదారీతనం లేకపోవడం కాదనే సత్యాన్ని న్యాయవ్యవస్థ కూడా గుర్తించాల్సిన సమయం వచ్చింది. ఇటీవల హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన న్యాయాధికారి అరవింద్ మల్హోత్రా తన కంటే జూనియర్లను హైకోర్టు న్యాయమూర్తులుగా సిఫారసు చేయగా, తనను ఎందుకు పక్కన పెట్టారో తెలుసుకోవాలనడం ఈ చర్చను మరోసారి ముందుకు తీసుకొచ్చింది. వ్యక్తిగతంగా ఇది ఒక అధికారికి జరిగిన అన్యాయం మాత్రమే కాదు.

న్యాయమూర్తుల నియామక వ్యవస్థ ప్రజాస్వామ్య సూత్రాలకు ఎంత మేరకు అనుగుణంగా ఉందనే పెద్ద ప్రశ్నను కూడా లేవనెత్తింది. భారత రాజ్యాంగ నిర్మాతలు న్యాయవ్యవస్థకు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించారు. అయితే న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించిన పూర్తి విధానాన్ని రాజ్యాంగంలో పేర్కొనలేదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 217 హైకోర్టు న్యాయమూర్తి కావడానికి అవసరమైన అర్హతలను మాత్రమే నిర్దేశించింది. కానీ అర్హులైన వారిలో ఎవరిని ఎంపిక చేయాలి? ఎలాంటి ప్రమాణాలకు ఎంత ప్రాధాన్యం ఇవ్వాలి? అనే అంశాలను పేర్కొనలేదు. ఆ ఖాళీని తరువాత సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా ఏర్పడిన కొలీజియం వ్యవస్థ భర్తీ చేసింది. అయితే, న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి రూపొందించిన ఈ వ్యవస్థ, క్రమంగా పూర్తిగా మూసివేసిన వ్యవస్థగా మారిపోయిందనే విమర్శలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. మాజీ న్యాయమూర్తి జస్టిస్ జె. చలమేశ్వర్ ఒకసారి చేసిన వ్యాఖ్య ఇప్పటికీ ప్రాసంగికంగానే ఉంది. “పారదర్శకత లేని వ్యవస్థ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతుంది” అని ఆయన కొలీజియం సమావేశాల మినిట్స్‌ను బహిర్గతం చేయాలని కోరుతూ భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థకు ప్రజల గౌరవం కేవలం అధికారంతో రాదు; విశ్వసనీయతతో వస్తుందనే సందేశాన్ని ఆయన అప్పుడే చెప్పారు. భారత మాజీ అటార్నీ జనరల్ సోలీ సోరాబ్జీ కూడా న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని బలంగా సమర్థించినప్పటికీ, కొలీజియం వ్యవస్థలో పారదర్శకత పెరగాలని పలుమార్లు సూచించారు. ఆయన అభిప్రాయం ప్రకారం, నియామక ప్రక్రియలో రాజకీయ జోక్యాన్ని నిరోధించడం ఎంత అవసరమో, అదే స్థాయిలో ప్రజల నమ్మకాన్ని పెంచే విధంగా కారణాలను వెల్లడించడం కూడా అంతే అవసరం.

మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి. లోకూర్ అనేక సందర్భాల్లో సంస్థాగత సామర్థ్యాన్ని పెంచేందుకు శాశ్వత సచివాలయం అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కొలీజియం సభ్యులు పదవీ విరమణతో మారిపోతుంటారు. దాంతో నిర్ణయాల్లో కొనసాగింపు, సంస్థాగత జ్ఞాపకశక్తి దెబ్బతింటుంది. ఒక శాశ్వత సచివాలయం ఉంటే అభ్యర్థుల సేవా చరిత్ర, పనితీరు, ఫిర్యాదులు, ప్రశంసలు వంటి అంశాలను క్రమబద్ధంగా నమోదు చేసి, ఒకే ప్రమాణాలతో పరిశీలించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎన్. వెంకటచలయ్య కూడా గతంలో న్యాయవ్యవస్థకు స్వాతంత్ర్యం ఎంత ముఖ్యమో, అదే సమయంలో పారదర్శకత కూడా అంతే అవసరమని అనేక సందర్భాల్లో అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఏ రాజ్యాంగ సంస్థ కూడా ప్రజల ప్రశ్నలకు పూర్తిగా అతీతంగా ఉండకూడదని ఆయన చెప్పిన మాటలు ఇప్పటికీ వర్తిస్తాయి. ప్రఖ్యాత న్యాయవేత్త ఫాలీ ఎస్. నారిమన్ కొలీజియం వ్యవస్థను సమర్థించినప్పటికీ, అది “పరిపూర్ణ వ్యవస్థ కాదు” అని స్పష్టంగా అంగీకరించారు.

కార్యనిర్వాహక జోక్యం కంటే కొలీజియం మెరుగైనదే అయినప్పటికీ, అందులో లోపాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దేందుకు అంతర్గత సంస్కరణలు తప్పనిసరిగా చేపట్టాలని ఆయన సూచించారు.

మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ కూడా న్యాయమూర్తుల నియామకాల్లో ప్రతిభతో పాటు సామాజిక వైవిధ్యం, ప్రాంతీయ సమతుల్యత, మహిళల ప్రాతినిధ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. న్యాయవ్యవస్థ సమాజాన్ని ప్రతిబింబించాల్సిందే తప్ప, కొద్దిమంది సామాజిక వర్గాలకే పరిమితం కాకూడదని ఆయన అభిప్రాయపడ్డారు.

న్యాయపరిశోధన రంగంలో ప్రముఖ పత్రికలైన “ఇండియన్ లా రివ్యూ”, “నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా రివ్యూ”, “జర్నల్ ఆఫ్ ఇండియన్ లా అండ్ సొసైటీ” వంటి పత్రికల్లో వెలువడిన అనేక పరిశోధనా వ్యాసాలు కూడా ఒకే విషయాన్ని పదేపదే గుర్తుచేస్తున్నాయి. న్యాయమూర్తుల వ్యక్తిగత చర్చలు గోప్యంగానే ఉండవచ్చు. కానీ ఎంపికకు ఉపయోగించే ప్రమాణాలు మాత్రం బహిరంగంగా ఉండాలని అవి సూచిస్తున్నాయి. కారణాలు చెప్పకుండా తీసుకునే నిర్ణయాలు ఎంత నిష్పాక్షికమైనవైనా ప్రజలలో అనుమానాలను పెంచుతాయని ఆ పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి.

అంతర్జాతీయ అనుభవాలు కూడా ఇదే విషయాన్ని బలపరుస్తున్నాయి. యునైటెడ్ కింగ్‌డమ్‌లో జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్, దక్షిణాఫ్రికాలో జ్యుడీషియల్ సర్వీస్ కమిషన్, కెనడాలోని న్యాయమూర్తుల ఎంపిక విధానాలు పూర్తిగా రాజకీయ ప్రభావానికి లోనుకాకుండా, అదే సమయంలో పారదర్శకతకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నాయి. అభ్యర్థుల ఎంపికకు అనుసరించే ప్రమాణాలు బహిరంగంగా ప్రకటించడం, దరఖాస్తులను క్రమబద్ధంగా పరిశీలించడం, ఎంపిక ప్రక్రియను సంస్థాగతంగా నిర్వహించడం వంటి విధానాలు అక్కడ అమలులో ఉన్నాయి. భారతదేశం వాటిని యథాతథంగా అనుసరించాల్సిన అవసరం లేకపోయినా, వాటి నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు మాత్రం ఉన్నాయి. నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్.జె.ఎ.సి.)ను సుప్రీంకోర్టు రద్దు చేసినప్పుడు కూడా ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేసింది. న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని దెబ్బతీసే మార్పులను అంగీకరించలేమని చెబుతూనే, కొలీజియం వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు మెమొరాండం ఆఫ్ ప్రొసీజర్‌ను సవరించాలని కేంద్ర ప్రభుత్వానికి, సంబంధిత వర్గాలకు సూచించింది. దురదృష్టవశాత్తు ఆ సంస్కరణలు ఇంకా పూర్తిగా అమలు కాలేదు. ఇక్కడ ప్రధానంగా అవసరమయ్యేవి విప్లవాత్మక మార్పులు కావు. ముందుగా, కొలీజియం ఎంపికకు అనుసరించే ప్రమాణాలను అధికారికంగా ప్రకటించాలి. రెండవది, పక్కన పెట్టబడిన అభ్యర్థికి కనీసం సాధారణ స్థాయిలో అయినా కారణాలు తెలియజేయాలి. మూడవది, నియామక ప్రక్రియకు ఒక శాశ్వత సచివాలయాన్ని ఏర్పాటు చేసి సంస్థాగత జ్ఞాపకశక్తిని కాపాడాలి. నాలుగవది, అభ్యర్థులపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించేందుకు స్పష్టమైన విధానాన్ని రూపొందించాలి. ఐదవది, మహిళలు, వెనుకబడిన వర్గాలు, వివిధ ప్రాంతాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించే విధంగా విధానపరమైన మార్గదర్శకాలు రూపొందించాలి. ప్రజాస్వామ్యంలో ప్రతి రాజ్యాంగ సంస్థ ప్రజల విశ్వాసంపైనే నిలబడుతుంది. న్యాయవ్యవస్థ విషయంలో ఈ సత్యం మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంటుంది. ఒక న్యాయమూర్తి తన ప్రతి తీర్పుకు కారణాలు చెప్పాల్సిందేనని న్యాయసూత్రం చెబుతుంది. అదే సూత్రం న్యాయమూర్తులను ఎంపిక చేసే వ్యవస్థకూ వర్తించాలి. ఎందుకంటే న్యాయం జరగడం మాత్రమే కాదు; న్యాయం జరిగినట్లు ప్రజలకు కనిపించడము కూడా అంతే ముఖ్యం. న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని కాపాడటం ఎంత అవసరమో, దానిపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం కూడా అంతే అవసరం. ఆ విశ్వాసం రహస్యాలతో కాదు, పారదర్శకతతో పెరుగుతుంది. అధికారంతో కాదు, జవాబుదారీతనంతో బలపడుతుంది. కొలీజియం వ్యవస్థ ఈ సత్యాన్ని ఎంత త్వరగా అంగీకరిస్తే, భారత న్యాయవ్యవస్థ అంతగా బలపడుతుంది. స్వతంత్రతకు ప్రత్యామ్నాయం లేదు. కానీ స్వతంత్రతకు విశ్వసనీయతను జోడించేది పారదర్శకత మాత్రమే. అదే ప్రజాస్వామ్యానికి, అదే న్యాయపాలనకు నిజమైన బలం.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.**
ramkishore.1504@gmail.com

## అర్హులైన ఓటర్ల పేర్లు పోకుండా ఉండటానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలి...

**- నాగారం డివిజన్‌లో ఓటర్ లిస్టు సవరణ**
**- కార్యక్రమాన్ని పరిశీలించిన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్**



**నాగారం, జూన్ 29:-(జర్నలిస్ట్ డైరీ)** మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ ఎస్సీ క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ నెం. 216లో బీఎల్ఓ సీహెచ్ అనురాధ ఆధ్వర్యంలో, బూత్ నెం. 242లో బీఎల్ఓ మహేష్ తివారి ఆధ్వర్యంలో ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీని పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. అనంతరం వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారమ్‌ను పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓకు సమర్పించాలని సూచించారు. ఫారమ్‌ను సక్రమంగా సమర్పించిన వారి పేర్లు మాత్రమే తుది ఓటరు జాబితాలో కొనసాగుతాయని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియను బాధ్యతగా పూర్తి చేయాలని కోరారు. అలాగే కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్ఎలు) ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్లందరికీ ఎన్యూమరేషన్ ఫారమ్‌లు అందేలా చూడాలని, ఏ ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగించబడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ అశోక్ గౌడ్ , మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు వెంకట్ రెడ్డి, హరిబాబు, సుమిత్ర, సురేష్, మాజీ ఎంపీటీసీలు పంగ ముత్యాలు, ప్రవీణ్, ముద్రగానం మహేంద్ర యాదవ్, మాజీ ఉపసర్పంచ్ మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సతీష్ గౌడ్, దాసోహం నర్సింహరావు, రాల కృష్ణయ్య యాదవ్, రాల సన్నీ యాదవ్, పంగ శ్రీహరి, పంగ సంతోష్, ప్రసాద్ పంతులు , దాసర్ రామ్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, బొల్లబోయిన సత్యనారాయణ యాదవ్, పరమేష్, భూములి యాదవ్, ఓం ప్రకాష్ గౌడ్, యువ నాయకులు జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి మెడలో బంగారు పుస్తెలతాడు లాక్కెళ్లిన నిందితుడి అరెస్ట్.....

**- 4 తులాల బంగారం, ద్విచక్ర వాహనం స్వాధీనం**




**నాగారం, జూన్ 29:-(జర్నలిస్ట్ డైరీ)** మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధి చీర్యాల గ్రామంలో వృద్ధ మహిళ మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును దోచుకున్న నిందితుడిని కీసర పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి బంగారు పుస్తెలతాడుతో పాటు నేరానికి ఉపయోగించిన హోండా యాక్టివా ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. జూన్ 26న వృద్ధురాలు సింగిరెడ్డి మల్లమ్మ ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించిన దుండగుడు ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారయ్యాడు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం నిందితుడు కత్తి అనిల్ కుమార్ ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అప్పుల కారణంగానే దోపిడీకి పాల్పడినట్లు అతడు ఒప్పుకున్నాడని,ఈ కేసును త్వరగా ఛేదించిన ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు, ఎస్ఐ అనిల్ కుమార్ తో పాటు పోలీసు సిబ్బందిని మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్, ఐపీఎస్ అభినందించారు.

## కాప్రా గాంధీనగర్లో అంగన్వాడీ ద్యార్థులకు ప్రభుత్వ యూనిఫామ్ పంపిణీ...



**నాగారం, జూన్ 29:-(జర్నలిస్ట్ డైరీ)** కాప్రా గాంధీనగర్ అంగనవాడీ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల యూనిఫారం ని సోమవారం పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాంధీనగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జి సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యావృద్ధికై కృషిచేస్తున్నారన్నారు. విద్యావ్యవస్థలో విప్లవత్మాకమైన మార్పులు చేపడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అంగన్వాడీ దశ నుండి మెరుగైన విద్య, నాణ్యమైన పౌష్టికాహారం, యూనిఫామ్ అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ వాసవి, గాంధీనగర్ వెల్ఫేర్ అధ్యక్షులు ఎన్ మహేష్ మరియు గాంధీనగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జి సత్యనారాయణ, యూత్ అసోసియేషన్ ప్రతినిధులు జి బాలయ్య, తన్నీరు శ్రీహరి, మనోజ్ కుమార్ తదితరులు మరియు అంగన్వాడీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. జి సత్యనారాయణ గాంధీనగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు,కాప్రా డివిజన్ కాంగ్రెస్ నాయకులు

## సత్వర పరిష్కారమే లక్ష్యం

**- అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్**
**- ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం కల్పించాలి**
**- అధికారులకు అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ ఆదేశం**



**సిద్దిపేట,జూన్ 29 (జర్నలిస్ట్ డైరీ)** ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 162 దరఖాస్తులు వివిధ సమస్యలపై అందినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులపై నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వస్తారని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి దరఖాస్తును బాధ్యతాయుతంగా పరిశీలించి, సంబంధిత శాఖలు వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైజాగ్ వేదికగా నేడు

# లెనిన్ ట్రైలర్ విడుదల




అక్కినేని అఖిల్ అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మాస్ కంబ్యాక్ మూవీ 'లెనిన్' ఇప్పుడు ప్రమోషన్స్‌లో వేగం పెంచింది. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న ఈ మాస్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొనగా, తాజాగా ట్రైలర్ లాంచ్‌కు సంబంధించిన అప్‌డేట్ సినిమాపై మరింత హైప్‌ను పెంచుతోంది. చిత్ర బృందం 'లెనిన్' థియేట్రికల్ ట్రైలర్‌ను జూన్ 30న విశాఖపట్నంలో గ్రాండ్‌గా విడుదల చేయాలని నిర్ణయించింది. సాయంత్రం 4 గంటలకు నగరంలోని ప్రముఖ శరత్ థియేటర్‌లో ఈ ఈవెంట్ జరగనుంది. ట్రైలర్ లాంచ్ కోసం ఇప్పటికే భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. అఖిల్ అభిమానులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోస్టర్‌లో అఖిల్ పూర్తిస్థాయి రస్టిక్ లుక్‌లో సైకిల్ తొక్కుతూ కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది. 'ఏజెంట్' తర్వాత అఖిల్ నుంచి వస్తున్న ఈ సినిమా ఆయన కెరీర్‌కు కీలకంగా మారనుంది. చాలా కాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న అఖిల్, ఈసారి పూర్తిస్థాయి మాస్ యాక్షన్ కథను ఎంచుకోవడం విశేషం. ఈ చిత్రంలో అఖిల్ సరసన యువ నటి భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. వీరిద్దరి కెమిస్ట్రీ కూడా సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, మనం ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంగీత దర్శకుడు ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలపై మంచి అంచనాలు నెలకొన్నాయి. జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న 'లెనిన్' చిత్రం అఖిల్ కెరీర్‌లో అత్యంత కీలకమైన సినిమాగా భావిస్తున్నారు.

# ఇరుముడి కట్టు'తో భక్తి సంద్రంలో రవితేజ..

## ఫస్ట్ సాంగ్‌కు అద్భుతమైన స్పందన




మాస్ మహారాజా రవితేజ హీరోగా దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ 'ఇరుముడి' సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన తొలి పాట 'ఇరుముడి కట్టు' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అయ్యప్ప స్వామి భక్తి నేపథ్యంలో రూపొందిన ఈ గీతం భక్తి భావాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసేలా ఉండటంతో సోషల్ మీడియాలో మంచి స్పందనను సొంతం చేసుకుంది. సోమవారం (జూన్ 29) చిత్ర బృందం విడుదల చేసిన ఈ లిరికల్ వీడియోలో రవితేజ భక్తి పారవశ్యంలో మునిగిపోయిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ ప్రారంభమయ్యే ఈ పాట, చివరి వరకు భక్తి రసాన్ని కొనసాగిస్తూ శ్రోతలను అలరిస్తోంది.పాటలో అయ్యప్ప మాలధారణలో కనిపించిన రవితేజ, భక్తి భావాలతో నిండిన స్టెప్పులు వేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆయన లుక్, ఎక్స్‌ప్రెషన్స్, పాట చిత్రీకరణకు సంబంధించిన విజువల్స్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే సినిమాలో రెండు అయ్యప్ప స్వామి భక్తి గీతాలు ఉంటాయని ఆయన వెల్లడించారు. అందులో భాగంగా విడుదలైన తొలి పాటకు సంగీతం, ఆర్కెస్ట్రేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ గీతాన్ని గాయకుడు అనంతు తన స్వరంతో అద్భుతంగా ఆలపించారు. పాట సాహిత్యాన్ని దర్శకుడు శివ నిర్వాణ, రచయిత కళ్యాణ్ చక్రవర్తితో కలిసి రాయడం విశేషం. దర్శకుడిగానే కాకుండా మంచి సాహిత్యకారుడిగా కూడా శివ నిర్వాణ మరోసారి తన ప్రతిభను చాటుకున్నారు. డివోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న 'ఇరుముడి' సినిమాలో భక్తి, భావోద్వేగాలు, థ్రిల్ అంశాలు సమపాళ్లలో ఉండనున్నాయని సమాచారం. ఫస్ట్ సాంగ్‌కు వస్తోన్న స్పందనను చూస్తుంటే సినిమా సంగీతం కూడా ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే 'ఇరుముడి కట్టు' పాట భక్తుల్లో ప్రత్యేక ఆదరణ పొందుతుండగా, రాబోయే రోజుల్లో సినిమా నుంచి వచ్చే ఇతర అప్‌డేట్స్‌పై కూడా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# 'నో' చెప్పడం నేర్చుకోండి

ప్రతిభావంతులైన నటీనటులు రొటీన్ కథలకు 'నో' చెప్పడం నేర్చుకోవాలి' అంటున్నారు బాలీవుడ్ భామ కంగనా రనౌత్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలను ఆమె వెల్లడించారు. 'నా యాటిట్యూడ్ కొందరికి ఇబ్బందిగా ఉంటుంది. నిర్మొహమాటంగా మాట్లాడటం. నచ్చని దాన్ని 'నచ్చలేదు' అని ముఖం మీదే చెప్పడం చాలామందికి నచ్చదు. కానీ నా ఉద్దేశ్యంలో 'నో' చెప్పడం చేతకాని వాళ్లు జీవితాన్ని గెలవలేరు. ఈ కారణంగా మనం టార్గెట్ అయినా.. దక్కాల్సిన అవకాశాలు మనకు దక్కకపోయినా.. చివరికి మాత్రం నిజాయితీనే గెలుస్తుంది. సంఖ్య అనేది ఎప్పటికీ ముఖ్యం కాదు. క్వాలిటీనే ముఖ్యం. మనం చేసిన పాత్రలు కొన్నేళ్లపాటు గుర్తుంటే, మనం ఆటోమేటిగ్గా గుర్తుంటాం. నచ్చని కథల్ని దూరం పెట్టాను కాబట్టే, నేను రెగ్యులర్ హీరోయిన్ల లిస్ట్‌లో లేను. అందుకు బాధ లేదు. నాకంటూ జనాల్లో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అది చాలు' అన్నారు కంగనా. ప్రస్తుతం ఆమె 'క్వీన్ 2'లో నటిస్తున్న విషయం తెలిసిందే.

# బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మూవీ అరుదైన రికార్డు



టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన కెరీర్‌లో అరుదైన డిజిటల్ మైలురాయిని అందుకున్నారు. పలువురు స్టార్ హీరోలకు కూడా సాధ్యం కాని ఘనతను ఆయన సొంతం చేసుకుని సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కించిన 2017 యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జయ జానకి నాయక' హిందీ డబ్బింగ్ వెర్షన్ యూట్యూబ్‌లో ఏకంగా 1 బిలియన్ (100 కోట్ల) వ్యూస్ సాధించి సంచలనం సృష్టించింది. 'ఖుంఖార్' పేరుతో ప్రముఖ యూట్యూబ్ ఛానెల్‌లో విడుదలైన ఈ చిత్రం సంవత్సరాలు గడిచినా ప్రేక్షకాదరణను ఏమాత్రం కోల్పోలేదు. నెమ్మదిగా వ్యూస్ పెంచుకుంటూ వచ్చిన ఈ సినిమా ఇప్పుడు వంద కోట్ల వ్యూస్ మార్క్‌ను దాటడం విశేషం. దీంతో భారతీయ సినీ చరిత్రలో ఈ అరుదైన ఘనత సాధించిన చిత్రాల జాబితాలో చోటు దక్కించుకుంది. ఈ రికార్డుతో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పేరు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. యూట్యూబ్‌లో ఒక ఫుల్ లెంగ్త్ డబ్బింగ్ సినిమాకు 1 బిలియన్ వ్యూస్ సాధించిన తొలి తెలుగు హీరోగా ఆయన నిలిచారు. టాలీవుడ్‌కు చెందిన అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలు హిందీలో డబ్ అయ్యి యూట్యూబ్‌లో విడుదలైనప్పటికీ, ఒక్క సినిమాతో ఈ స్థాయి వ్యూస్‌ను అందుకోవడం ప్రత్యేకమైన విజయంగా చెప్పవచ్చు. ఈ సినిమాలో రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్‌గా నటించగా, జగపతిబాబు, శరత్ కుమార్ కీలక పాత్రలు పోషించారు. థియేటర్లలో డీసెంట్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం, డిజిటల్ ఎ÷–లాట్‌ఫామ్‌లలో మాత్రం అసాధారణ ఆదరణను దక్కించుకుంది.

# ఇరుముడి కట్టు లిరికల్ వీడియో విడుదల




మాస్ మహారాజా రవితేజ హీరోగా దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ 'ఇరుముడి' సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన తొలి పాట 'ఇరుముడి కట్టు' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అయ్యప్ప స్వామి భక్తి నేపథ్యంలో రూపొందిన ఈ గీతం భక్తి భావాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసేలా ఉండటంతో సోషల్ మీడియాలో మంచి స్పందనను సొంతం చేసుకుంది. సోమవారం చిత్ర బృందం విడుదల చేసిన ఈ లిరికల్ వీడియోలో రవితేజ భక్తి పారవశ్యంలో మునిగిపోయిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ ప్రారంభమయ్యే ఈ పాట, చివరి వరకు భక్తి రసాన్ని కొనసాగిస్తూ శ్రోతలను అలరిస్తోంది. పాటలో అయ్యప్ప మాలధారణలో కనిపించిన రవితేజ, భక్తి భావాలతో నిండిన స్టెప్పులు వేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆయన లుక్, ఎక్స్‌ప్రెషన్స్, పాట చిత్రీకరణకు సంబంధించిన విజువల్స్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే సినిమాలో రెండు అయ్యప్ప స్వామి భక్తి గీతాలు ఉంటాయని ఆయన వెల్లడించారు. అందులో భాగంగా విడుదలైన తొలి పాటకు సంగీతం, ఆర్కెస్ట్రేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ గీతాన్ని గాయకుడు అనంతు తన స్వరంతో అద్భుతంగా ఆలపించారు. పాట సాహిత్యాన్ని దర్శకుడు శివ నిర్వాణ, రచయిత కళ్యాణ్ చక్రవర్తితో కలిసి రాయడం విశేషం. 'ఇరుముడి' సినిమాలో భక్తి, భావోద్వేగాలు, థ్రిల్ అంశాలు సమపాళ్లలో ఉండనున్నాయని సమాచారం. ఫస్ట్ సాంగ్‌కు వస్తోన్న స్పందనను చూస్తుంటే సినిమా సంగీతం కూడా ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465